## డిసెంబర్ 13న సిఎండి కార్యాలయ ముట్టడి

ఖమ్మం: డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ఖమ్మం జిల్లాలో జాగృతి బాటలో కవిత ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తామన్నారు. సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కొట్లాడుతున్నామన్నారు. సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :228 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 19-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ..ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత హిడ్మా హతం



మారేడుమిల్లి,నవంబర్18: మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొంగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మూరియా తెగకు చెందిన వ్యక్తి . 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీఆర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004 నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో హిడ్మాతో సహా ఆరుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

## ఓటమికి బాధ్యత నాదే: ప్రశాంత్ కిషోర్



న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సూరజ్ పార్టీ ఘోరంగా ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ దీనిపై తొలిసారి స్పందించారు. గెలుపు కోసం నిజాయితీతో పనిచేశానని, కానీ తన ప్రయత్నంలో విఫలమైనట్లు ఆయన చెప్పారు. దీనికి పూర్తిగా తానే బాధ్యత వహిస్తున్నట్లు ప్రశాంత్ వెల్లడించారు. 243 స్థానాలు ఉన్న బీహార్‌లో.. జన్ సూరజ్ పార్టీ 238 స్థానాల్లో పోటీ చేసింది. ఓటమి తమకు సెట్‌బ్యాక్ అని, కానీ పొరపాట్లను సవరించుకుంటామన్నారు. మళ్లీ పునర్ నిర్మిస్తామని, వెనుకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. ఎన్డీఏకు ప్రజలు తమ మద్దతు తెలిపారని, హామీలను నెరవేర్చే బాధ్యత ప్రధాని మోదీ, సీఎం నితీశ్‌పై ఉందన్నారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకవేళ నితీశ్ సర్కారు మహిళలకు పది వేలు ఇవ్వకుంటే జేడీయూకు కనీసం 25 సీట్లు కూడా వచ్చేది కాదని ప్రశాంత్ కిషోర్ అన్నారు. 1.5 కోట్ల మందికి ఒకవేళ నితీశ్ ప్రభుత్వం రెండు లక్షలు ఇస్తే అప్పుడు కచ్చితంగా రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని ప్రశాంత్ కిషోర్ అన్నారు. ఓట్ చోరీ అనేది దేశవ్యాప్తంగా జరుగుతున్నదని, మాది చిన్న పార్టీ అని, జాతీయ పార్టీలు అన్నీ కలిసి దీనిపై చర్చలు నిర్వహించాలన్నారు. ఒకవేళ అవసరం అయితే సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఆయన సూచించారు. నితీశ్ తరహాలో బీహార్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమైనట్లు ఆయన తెలిపారు. కులం, మతం, ఓట్ల ప్రాతిపదికన బీహార్‌ను వాళ్లు విభజన చేశారని ఆరోపించారు.

## 21న జాతీయ రహదారుల దిగ్బంధం..



హైదరాబాద్ : ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు.రైతులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు.రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తి తేమశాతం ఎక్కువగా ఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది. గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం పైన ఒత్తిడి తీసుకొచ్చి 20 నుంచి 22 శాతం తేమ ఉన్న పంటను కూడా కొనిపించాము. కానీ ఇప్పుడు కేవలం 12 శాతం తేమ ఉంటే కూడా కొనుగోలు చేయము అని చేతులు ఎత్తేసింది. రైతులు పంటలు అమ్ముకోలేక ఆత్మహత్యలు చేసుకుంటే కూడా పట్టించుకునే వారు లేరు కనీసం అడిగే వారు కూడా లేరు. కనీసం ఇప్పటిదాకా లక్ష క్వింటాళ్ల పంట కూడా కొనలేదు. ప్రైవేట్ వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల పంటను దోచుకుంటున్నది అని అనిపిస్తున్నది. లేకుంటే రైతన్నలకు ఎన్ని సమస్యలు వచ్చిన స్పందించకుండా ఉండదు అని కేటీఆర్ పేర్కొన్నారు.కనీస మద్దతు ధర రూ. 8,100 రైతుకు దక్కాల్సింది కానీ ఐదారు వేలు కూడా దక్కడం లేదు. సోయాబీన్ అమ్మకానికి సంబంధించి ఫింగర్ ప్రింట్ కావాలని చెప్పి ఒక నిబంధన పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. సొంత తల్లిదండ్రుల పేరు మీద ఉన్న పంటలు బిడ్డలు అమ్మాలంటే కూడా కొనుగోలు చేయడం లేదు. పత్తి పంట ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామనే ఒక అర్థరహితమైన నిబంధన పెట్టారు. ఆదిలాబాద్‌లో ఉన్న భూసార పరిస్థితుల వలన పది పదిహేను క్వింటాళ్ల వరకు ఎకరానికి పండుతుంది మరి మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలి. ఈరోజు మేము రైతన్నలను కలవడానికి వెళ్తున్నామని తెలుసుకున్న ప్రభుత్వం నాటకాలు మొదలుపెట్టారు అని కేటీఆర్ మండిపడ్డారు.కేంద్రంతో వీడియో కాన్ఫరెన్స్ అంటూ నాటకాలు మొదలుపెట్టారు. కానీ నిన్న జరిగిన క్యాబినెట్లో 50 శాతానికి పైగా తెలంగాణ జిల్లాలో పండుతున్న పత్తి పంట పైన కనీసం మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు సరఫరా నుంచి మొదలుకొని యూరియా సప్లై దాకా చివరికి పంట అమ్మకానికి సంబంధించి కూడా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. రాష్ట్రంలో రైతన్నల పంటలు కొనుగోలు చేసే పరిస్థితులు కూడా లేవు. దేశంలోనే అత్యుత్తమ పంటను పండించే రాష్ట్రం తెలంగాణ కానీ ఇక్కడి తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టి రైతన్నలను పట్టించుకోవడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.దేశంలో అద్భుతమైన నాణ్యత కలిగిన పత్తి పంట పండుతుంటే కేంద్రంలోని బిజెపి మాత్రం విదేశాల నుంచి పత్తిని దిగుమతి చేయించుకుంటుంది.

## మా పోటీ సింగపూర్, టోక్యో, న్యూయార్క్‌తో: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 18: మా పోటీ ఇతర రాష్ట్రాల నగరాలతో కాదు.. మా పోటీ సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతోనని, ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హోటల్ ITC కోహినూర్ లో దక్షిణపశ్చిమ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల అర్బన్ డెవలప్మెంట్ మినిస్టర్స్ రీజనల్ మీటింగ్ లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఎకానమీలో 10 శాతం ఎకానమీని తెలంగాణ నుంచి అందించాలని భావిస్తున్నాం, హైదరాబాద్ నగర అభివృద్ధితోపాటు మేం భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నాం, రాష్ట్రంలో డ్రై పోర్టు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం భారత దేశమని అన్నారు. వికసిత్ భారత్ 2047 అనుగుణంగా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా దేశాన్ని తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ పనిచేస్తున్నారన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్ర మంత్రి ఖట్టర్ ని కోరుతున్నామన్నారు.వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులు వేగంగా జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్, గోదావరి జలాల తరలింపు, మూసీ ప్రక్షాళనతో పాటు వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉండాలన్నారు. రాబోయే ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్ నగరంలో తీసుకురావాలని ప్రణాళికలు వేస్తున్నామన్నారు. డిసెంబర్ 9 న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేయబోతున్నామని, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్ లాల్ దేశాయ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు.

## తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం తప్పే



ఖమ్మం,నవంబర్18: రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు. తుమ్మల లాంటి నేతను బీఆర్ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోందని వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. కొత్త రాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయించుకో లేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మక మైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని.. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జమలాపురం టెంపుల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జమలాపురం ఆలయంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. పాతర్లపాడులో సామినేని రామారావు దారుణ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రామారావు హత్యపై డీజీపీని కలువనున్నట్లు కవిత తెలిపారు. హత్యా రాజకీయాలు సరికాదన్నారు. రేపు (బుధవారం) హైదరాబాద్‌లో సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్‌ను ముట్టడించబోతున్నామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించి రైతాంగానికి సాగు నీరు అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి వచ్చే వరకు వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేవారు. తెలంగాణలో పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని.. సీసీఐతో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలే



వరంగల్: కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని హరీశ్ రావు సందర్శించారు. పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, బీజేపీ తప్పుడు విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.సీసీఐ తుగ్లక్ వంటి పిచ్చి నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నది. ఎల్1, ఎల్2, ఎల్3 విధానం, కపాస్ యాప్‌లో 8 నుంచి 12 శాతం తేమ ఉండాలనే నిర్ణయాలతో రైతులు రోడ్ల మీద పడే పరిస్థితి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయి. పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారు. ఈరోజు రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవకాశం లేక అడ్డగోలుగా దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. పత్తికి మద్దతు ధర రూ. 8,100. కానీ, రూ.6 వేలకే రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. క్వింటాల్ మీద రూ.2000ల చొప్పున పత్తి రైతులు నష్టపోతున్నారు. మాటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరచేతిలో వైకుంఠం చూపించి, చేతల్లో నరకం చూపిస్తున్నాయి.

### 60 సార్లు ఢిల్లీకి పోయిన ముఖ్యమంత్రికి..

వరదలు, తుఫాన్‌ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే తుగ్లక్ నిర్ణయాలతో మరింత ఇబ్బంది పెట్టడం సరికాదు. 60 సార్లు ఢిల్లీకి పోయిన ముఖ్యమంత్రికి పత్తి రైతుల గురించి కేంద్రానికి విన్నవించే అవకాశం రాలేదా?. పత్తి రైతుల సమస్యలు కేంద్రానికి చెప్పే ఓపిక లేదా? సమయం లేదా?. రేవంత్ రెడ్డికి బడేభాయితో మంచి సంబంధాలే ఉన్నాయి కదా. ఎందుకని పత్తి రైతుల గురించి బడే భాయికి చెప్పడం లేదు. ఉప ఎన్నికల్లో గెలవడానికి విచ్చలవిడిగా డబ్బులు పంచిన రేవంత్ రెడ్డి పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందించలేకపోతున్నారు. ఒకవైపు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట చేనులన్నీ దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 8 నుంచి 12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్ ని రద్దు చేయండి. స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పని. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా.

సంపాదకీయం

బుధవారం 19-11-2025

## గెలుపుతో సమస్యలు విస్మరించరాదు !

తెలంగాణలో కేవలం కెసిఆర్, కెటిఆర్ అహంకారం వల్లనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసారు. అదికూడా బండి సంజయ్‌ను బిజెపి అధ్యక్షుడిగా తొలగించడంతో బిజెపి వైపు ఉన్న సానుకూల పవనాలు రేవంత్ వైపు చూపించారు. ఇది రెండేళ్ల క్రితం నాటి ఎన్నికల ముందు పరిస్థితి. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదు. ఎందుకంటే బండిని తొలగిచగానే బిజెపి, బిఆర్‌ఎస్ కుమ్మక్కయ్యయాని క్షేత్రస్థాయిలో కూడా ప్రజలు చర్చించుకుని ముక్కున వేలేసుకున్నారు. అందుకే అటు బిజెపిని, ఇటు బిఆర్‌ఎస్‌ను దెబ్బకొట్టి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా ప్రజలు రేవంత్‌ను నమ్మి గెలిపించారు. ఇది కూడా కేవలం రేవంత్ వ్యూహం వల్లనే అని చెప్పక తప్పదు. అయితే అన్నింటికిమించి ఆరు గ్యారెంటీ లను ప్రస్తావిస్తూ..అన్ని హామీలను నెరవేర్చామని కాంగ్రెస్ పదేపదే ప్రకటిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న అనేక సమస్యలను అసలు పరిష్కారం దిశగా చూడడం లేదు. ధరణి పోయి భూమాత వచ్చినా సమస్యలు అలాగే ఉన్నాయి. అనేక భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని వార్తలు ప్రచురితం అవుతున్నా పట్టించు కోవడం లేదు. దేవాదాయ శాఖ భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి గురించి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకే తెలియదు. అసలు దేవాదాయ శాఖలో ఏం జరుగుతుందో ఆమె తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు. అటవీ భూములు పరిస్థితి అలాగే ఉంది. రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. హైదరాబాద్‌లో రోడ్ల అధ్వానంనం గురించి మంత్రి కోమటిరెడ్డికి కూడా పట్టింపు లేదు. అంతెందుకు వరంగల్ హైవేలో రోడ్డను బాగు చేద్దామన్న సోయి లేదు. లంచం ఇవ్వనిదే ఉద్యోగులు ఏ పనీ చేయడం లేదు. ఉద్యోగులను గట్టిగా అదిలించ లేకపోతున్నారు. ఒకరిద్దరు ఎసిబికి చిక్కుతున్నా అది ప్రభావం చూపడం లేదు. గ్రామాల్లో తెల్లరేషన్ కార్డు విధానం తీవ్రంగా దుర్వినియోగం అవుతోంది. రేషన్ బియ్యం కొత్త వ్యాపార దందాకు తెరతీసింది. దీనిపై పౌరసరఫరాలశాఖ మంత్రికే తెలియడం లేదు. ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఇవి మచ్చుకు తీసుకుని చర్చిస్తున్న అంశాలు మాత్రమే. ఫీజు రియంబర్స్‌మెంట్ దోపిడీ, ఆరోగ్యశ్రీ దోపిడీలు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ కూడా సిఎంగా రేవంత్ రెడ్డిపైనే ప్రభావం చూపుతాయి. మంచి జరిగితే ఎలాగైతే పేరు వస్తుందో చెడు జరిగినా సిఎంగా రేవంత్‌పైనే ప్రభావం చూపుతాయి. ఎంతసేపు ఉప ఎన్నికల్లో గెలిచమనో, బిసి రిజర్వేషన్లను అమలు చేశామనో లేఓ అమలు చేయబోతున్నామనో చెబితే సమస్యలను పరిష్కరించి నట్లు కాదు. చిన్న సమస్యను కూడా సీరియస్‌గా తీసుకని పరిష్కరించాలి. ఇల్లు అలకగానే పండగ కాదన్నట్లు ఒక ఉప ఎన్నికను సర్వశక్తులూ ఒడ్డి గెలిచనంత మాత్రాన అంతా అనుకూలంగా ఉందని భావిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతానికి రేవంత్‌రెడ్డి పైచేయి సాధించారు. అందులో అనుమానం లేదు. అలాగని ప్రజాభిమానాన్ని చూరగొనడానికి ఆయన ఇంకా ప్రయత్నించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలి. పార్టీలో క్రమశిక్షణ నెలకొల్పడంతో పాటు, మంత్రులను పనిచేసేలా అదిలించాలి. రెండేళ్ల వార్షికోత్సవం జరుపుకోవడానికి ముందు ఈ రెండేళ్ల పాలనలో మంచి చెడులను సమీక్షించుకోవాలి. మధ్య తరగతి, ఆపై వర్గాల ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉంది. హైదరాబాద్ నగర్ సమస్యలపై దృష్టి పెట్టడం ద్వారా ప్రజల మనసు గెలుచుకోవాలి. ఉప ఎన్నిక అంటే పార్టీ యంత్రాంగం అంతా మోహరిస్తుంది. సాధారణ ఎన్నికల్లో అలా చేయడం సాధ్యం కాదు. వనరులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వస్తోంది. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నందున ఈ పరిస్థితిని అధిగమించడానికి అవకాశం ఉంది. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ గెలవడంతో ఇక అంతా మంచి చేశామని, ప్రజలు తమవెంటే ఉన్నారని, కెసిఆర్ పని అయిపోయిందని అంటే ప్రజలు సహించరు. ముఖ్యమంత్రిగా రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాల ప్రజల మనోగతం తెలుసు కోవాలి. ప్రజల్లో ఏయే అంశాలపై అసంతృప్తి ఉందో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తన స్థానం పటిష్ఠం అయినందున ప్రజలకు సంబంధించిన సామాన్య సమస్యలపై దృష్టి సారించాలి. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి పరపతి పడిపోతోందని ప్రచారం చేసిన వారికి జూబ్లీఅహిల్ విజయంతో సమాధానం చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారం గత కొంత కాలంగా జోరుగా జరుగుతోంది. ఈ పరిస్థితులలో ఈ విజయం కాంగ్రెస్ పార్టీకి లాభించడం ఎలా ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠ పెరగడానికి మాత్రం దోహదం చేసిందనే చెప్పాలి. ఇదే సమయంలో ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో రేవంత్ పట్టు సాధించాలి. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం పైనే ఆ పార్టీ నాయకులు, శ్రేణులకు నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ రెండేళ్లుగా తనను ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా, హేళన చేసినా రేవంత్‌రెడ్డి ఓపికతో వెళుతున్నారు. అవకాశం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రూపంలో ఆయనకు ఆ అవకాశం వచ్చింది. ఆత్మవిశ్వాసంతో,పదునైన వ్యూహ రచనతో విజయాన్ని అందుకున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో రాష్ట్ర రాజకీయాలలో గానీ, ప్రజల జీవితాలలో గానీ మార్పులు రావు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోయి ఉంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోక పోయినా, వ్యతిరేకత మాత్రం విపరీతంగా పెరిగేది. రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ఇప్పుడు వచ్చిన ప్రమాదం లేదు. అయితే ఆయన ఎంతగా క్షేత్రస్థాయిలోకి వెళ్లగలిగితే అంతగా ప్రజల్లో స్థానం సాధిస్తారు. లేకుంటే ఈ మూడేళ్లలోనే గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదు.

## సంకీర్ణ రాజకీయాలకు బీహార్ నేర్పుతోన్న పాఠాలు.



పాట్నా:2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఫలితాలలో పెద్దగా చెప్పుకోదగ్గా ఆశ్చర్యమేమీ లేదు. అందరూ పందెంకాసిన గుర్రాలే గెలుపు గీతను దాటాయి. ఉన్న తేడాల్లా ఒకటే. ఈ గెలుపు గుర్రాలు పరిగెత్తిన వేగం. చూడడానికి ఈ ఎన్నికల ఫలితాలు సాధారణ ఎన్నికల ఫలితాలలాగా కనిపిస్తున్నప్పటికీబీ ఈ ఫలితాలకు దారితీసిన పరిణామాలు, ఆ పరిణామాలకున్న చారిత్రక నేపథ్యాలు, దేశంలో సంకీర్ణ రాజకీయాల ద్వారా బీజేపీని దానికి వెన్నుదన్నుగా ఉన్న సంఘపరివారాన్ని ఓడించాలనుకునే వారు తప్పక పరిశీలించాల్సినవే.గణాంకాలకు సంబంధించిన వివరాలు, విశ్లేషణలు వస్తూనే ఉన్నాయి. ముందుముందు మరిన్ని విశ్లేషణలు ఈ కోణంలో రావొచ్చు. ఈ చర్చలలో మరుగునపడుతోన్న మరో ముఖ్యమైన అంశమున్నది. అది సంకీర్ణాల నిర్మాణం.భారత రాజకీయాలకు సంకీర్ణాల నిర్మాణం కొత్తేమి కాదు. ప్రధాన శత్రువును ఓడించే లక్ష్యం రాజకీయాల పక్షం ముందున్నప్పుడు ఆ ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా సాధ్యమైనంత ఎక్కువమందిని కలుపుకోని పోరాడి గెలవడమే సంకీర్ణ నిర్మాణానికి పునాది.స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం విశాలమైన ప్రజాతంత్ర సంకీర్ణానికి ఉదాహరణగా నిలిస్తే, 2011 నుంచి 2021 వరకు దేశ రాజకీయాలలో వామపక్ష ప్రగతిశీల ప్రజాతంత్ర శక్తుల పలుకుబడిని, ప్రభావాన్ని కుదించడానికి తెర మీదికి వచ్చిన సంకీర్ణాలు(వర్గ సంకీర్ణాలు) మితవాద, ప్రగతి నిరోధక సంకీర్ణాలకు ఉదాహరణగా నిలుస్తాయి.ఎమర్జెన్సీ అనంతర రాజకీయాలు తెర మీదకు తెచ్చిన సంకీర్ణాలలో రెండు ధోరణులు ఉన్నాయి.పెరుగుతోన్న రాజకీయ సంక్షోభాన్ని నివారించే ప్రయత్నంలో, రాజకీయాలను విస్తృత ప్రాతినిధ్య రాజకీయాలుగా మల్చడం ఒక ధోరణి. 1980వ దశకంలో వివిధ రాష్ట్రాలలో తెర మీదకు వచ్చిన ప్రాంతీయ పార్టీల రూపంలో ఈ ధోరణి వ్యక్తమవుతోంది. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన లోక్సభ ఎన్నికలు తక్షణ రాజకీయ అవసరం– కాంగ్రెస్ నిరంకుశత్వ ధోరణులకు ఫుల్‌స్టాప్ పెట్టడం– నేపథ్యంలో సైద్ధాంతిక అంశాలకు పెద్దగా ప్రాధాన్యతివ్వలేదు. ఫలితంగా 1950 నుంచి ఎమర్జెన్సీ వరకు రాజకీయ అస్తిత్వం కోసం బిక్కుబిక్కుమంటూ ప్రయత్నాలు చేసిన మతోన్మాద శక్తులు అప్పటి వరకు తమపై ఉన్న మరకలను, మకిలిని తొలగించుకోవడానికి ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం అవకాశం కల్పించింది. దాని ఫలితమే ఎమర్జెన్సీ అనంతరం ఏర్పాటైన తొలి కాంగ్రెసేతర కేంద్ర ప్రభుత్వంలోబీ నేటి భారతీయ జనతా పార్టీకి పూర్వరూపమైన భారతీయ జనసంఘ్ భాగస్వామ్యం.

మతోన్మాదరహిత రాజకీయాల దిశగా అడుగులు..

ఈ కాలంలోనే భారత రాజకీయాలలో మతోన్మాద ప్రమాదం గురించిన అవగాహన నిర్దిష్ట రూపం తీసుకోవడంతో, మతోన్మాదరహిత రాజకీయాల దిశగా భారతీయ పౌర సమాజం అడుగులు వేసింది. ఈ తరహా రాజకీయాలకు కావాల్సిన ప్రజాతంత్ర భూమికను సమకూర్చడంలో అప్పటికీ ప్రభావశీల శక్తిగా ఉన్న వామపక్షాలు కీలక పాత్ర పోషించాయి.1989 లోక్సభ ఎన్నికల నాటికి భారతరాజకీయాలలో చర్చనీయాంశాల స్వభావం మారటం వెనుక రాజ్యాంగ విలువల ఆధారంగాబీ దేశాన్ని మతోన్మాదరహిత రాజకీయాల దిశగా నడిపించేందుకు ఆసక్తి చూపించిన ప్రగతిశీల పౌరసమాజం విశేష తోడ్పాటు అందించింది. ఈ నేపథ్యంలోనే ఎమర్జెన్సీ అనంతరం ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వానికి 1989లో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వానికి మధ్య మౌలికమైన తేడాను గమనించవచ్చు.నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అర్థాంతరంగా పతనం కావడంతో దాదాపు రెండు దశాబ్దాలపాటు ఒకే వేదికగా ఉన్నా జనతాదళ్ క్రమంగా చీలికలుపేలికలయింది. ఉత్తరభారతదేశంలో అప్పటికీ కాంగ్రెస్ తర్వాతబీ అన్ని రాష్ట్రాలలోనూ ఎంతో కొంతమేరా రాజకీయ ఉనికిని కలిగి ఉన్న పార్టీ జనతాదళ్ మాత్రమే. బీజేపీకి వెన్నుదన్నుగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ అన్ని రాష్ట్రాలలోనూ నిర్మాణ సామర్థ్యం కలిగిన సంస్థగా ఉన్నప్పటికీబీ బీజేపీ రాజకీయంగా పలుకుబడి కలిగిన సంస్థగా లేదు.

మితవాద సంకీర్ణ రాజకీయాలలో కొత్త దశ..

ఈ పరిస్థితిలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, కర్ణాటకలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఒక కర్ణాటకలో మాత్రమే హెగ్డే నాయకత్వంలో జనతాదళ్ ప్రభుత్వం ఏర్పడింది. మిగిలిన నాలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ క్షీణించడం జనతాపరివారం ఉనికిని కాపాడుకోవడానికి కష్టపడాల్సిన పరిస్థితులు తలెత్తడంతో ఉత్తరాది రాష్ట్రాలలో ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీ స్థిరపడిపోయింది.కానీ, బీహార్‌లో మాత్రం బీజేపీ ప్రధాన శక్తిగా ఎదగడానికి కావాల్సిన బలాన్ని సమకూర్చుకోవడంలో వెనకబడింది. అప్పటికే, కళ్యాణ్ సింగ్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఆయోధ్యలో చారిత్రక కట్టడం బాబ్రీ మస్జిద్‌ను కూల్చివేయడానికి కావాల్సిన సన్నాహాలు చేయడంలో మునిగిపోయింది. దీనికి భిన్నంగా బీహార్ మాత్రం కర్పూరి ఠాకూర్ ప్రారంభించిన సామాజిక న్యాయం నినాదాన్ని లౌకిక రాజకీయాలతో మేళవించి ఓ స్థిరమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా రాష్ట్రీయ జనతాదళ్ ముందుకు వచ్చింది. అప్పటి వరకు జనతా పరివారంలో ప్రధాన నాయకులుగా ఉన్న జార్జ్ ఫెర్నాండెజ్, శరద్ యాదవ్, రామ్‌విలాస్ పాశ్వాన్, నితీష్ కుమార్‌లు లాలూ ప్రసాద్‌ను వీడి సొంత కుంపట్లు పెట్టుకున్నారు.రాష్ట్రంలో సొంత బలాన్ని పెంచుకోవడానికి ఇదే అదనుగా భావించిన బీజేపీ, లాలూ ప్రసాద్ నేతృత్వంలోని ఆర్జేడీ మినహా మిగిలిన అన్ని పార్టీలతోనూ వివిధ సందర్భాలలో జతకట్టింది. ప్రత్యేకించి 1998 లోక్సభ ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో సహా లౌకిక పార్టీలుబీ సొంతంగా కానీ కలిసి కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి లేకపోవడంతో ఆ స్థానాన్ని బీజేపీ భర్తీ చేయడం.ఈ క్రమంలో అస్తిత్వం, అధికారం కోసం ఆరాటపడుతోన్న ప్రాంతీయ పార్టీలు బీజేపీతో కలిసి అధికారాన్ని పంచుకోవడానికి వెనుకాడలేదు. ప్రత్యేకించి సామాజిక న్యాయం, లోహియా వారసత్వం, కాంగ్రెస్ వ్యతిరేకత పునాదిగా ఉన్న జనతా పరివారం భాగస్వాములు తమ మౌలిక రాజకీయ అవగాహనలకు భిన్నంగా మతోన్మాద రాజకీయాలే పునాదిగా ఉన్న బీజేపీతో చేతులు కలపడం మితవాద సంకీర్ణ రాజకీయాలలో కొత్త దశ. ఈ క్రమంలోనే కేంద్రంలో అధికారంలో భాగస్వాములుగా ఉండడంతో కలిసివచ్చే అదనపు వెసులుబాట్లు, అవకాశాలు రాజకీయ పలుకుబడులు ఉపయోగించుకొనిబీ ఆర్జేడీ ఆధిపత్యం కలిగిన రాష్ట్రంలో లాలూ ప్రసాద్ రాజకీయ పునాదిని, రాజకీయ ఎజెండాను బద్దలుగొట్టడానికి కావాల్సిన వ్యూహాన్ని రూపొందించుకోవడం సాధ్యమైంది.ఈ పరిణామాల ఉమ్మడి ప్రభావం 2005 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించింది. ఆర్జేడీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమి నూతన సామాజిక సమీకరణాలకు తెరతీసింది. అందులో భాగంగానే అత్యంత వెనుకబడిన సామాజిక తరగతులు, కులాలు, ఉపకులాలను ఒక తాటి మీదకు తెచ్చి వారికి రాజకీయ ప్రాధాన్యం,

## పాత్రికేయులకేదీ పెద్ద దిక్కు?

న్యూఢిల్లీ,ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను కాపాడటానికి ఏర్పాటయిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఒక సంవత్సర కాలంగా పనిచేయడం లేదు. ప్రెస్ కౌన్సిల్ 14వ టర్మ్ (పదవీ కాలం) అక్టోబర్ 5, 2024న ముగిసిన తర్వాత, 140 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలోని చట్టబద్ధమైన, క్వాసీ జుడిషియల్ వ్యవస్థకు క్రియాశీలమైన కమిటీ లేకపోవడం చాలామందికి ఆశ్చర్యంగా అనిపించవచ్చు. పిసిఐ 15వ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడానికి ఎటువంటి ఆచరణాత్మక చర్యలు ప్రభుత్వం తీసుకోలేదు. కొత్త కౌన్సిల్ ఏర్పాటులో జాప్యాన్ని ఆశ్చర్యకరంగా అభివర్ణిస్తూ, వివిధ జర్నలిస్ట్ సంస్థలు సంబంధిత అధికారులను అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. వార్తా ఛానెళ్లు, రేడియో , డిజిటల్ ప్లాట్ ఫామ్‌లను దాని అధికార పరిధిలోకి తీసుకురావడానికి, అవసరమైతే, దానిని మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియాగా పేరు మార్చేందుకు పిసిఐకి అధికారం ఇవ్వాలని కూడా వారిలో చాలామంది డిమాండ్ చేశారు.పిసిఐ అనేది ఒక స్వయం ప్రతిపత్తి సంస్థ అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది మొదట 1966లో ప్రెస్ కౌన్సిల్ చట్టం 1965 కింద స్థాపించబడింది. తరువాత 1979లో ప్రెస్ కౌన్సిల్ చట్టం 1978 ద్వారా తిరిగి స్థాపించబడింది. దీని ప్రధాన లక్ష్యం దేశంలో పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం, వార్తాపత్రికలు, వార్తాసంస్థల ప్రమాణాలను మెరుగుపరచడం. ఈ కౌన్సిల్ మూడు సంవత్సరాల పదవీకాలాన్ని కలిగి ఉంది. గత సంవత్సరం చైర్‌పర్సన్ కొత్త కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోలేదు. పిసిఐలో ఒక చైర్మన్ (సాధారణంగా రిటైర్డ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తిని నియమిస్తారు) 28 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 13 మంది ప్రొఫెషనల్ జర్నలిస్టులు ఉంటారు. వీరిలో ఆరుగురు వార్తాపత్రికల సంపాదకులు, మరో ఏడు మంది పనిచేసే జర్నలిస్టులు ఉండాలి.మరో ఆరు మంది సభ్యులు వార్తాపత్రికల నిర్వహణకు (యజమానులతో సహా) ప్రాతినిధ్యం వహిస్తారు. పెద్ద, మధ్యస్థ, చిన్న వార్తాపత్రికల నుండి ఒక్కొక్కరు తీసుకోబడతారు. ఒక సభ్యుడు వార్తా సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తారు. పార్లమెంటులోని రెండు సభలు ఐదుగురు సభ్యులను పంపుతాయి. ముగ్గురు వ్యక్తులను విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సాహిత్య అకాడమీ వరుసగా విద్య, చట్టం, సాహిత్య రంగాల నుండి నామినేట్ చేస్తాయి. కానీ పిసిఐ వార్తాపత్రికలు, పత్రికలు, వార్తాసంస్థల పనితీరును మాత్రమే సమీక్షించగలదు. అంతేకాకుండా, మార్గదర్శకాలను అమలు చేయడానికి ఇది పరిమిత అధికారాన్ని కలిగి ఉంటుంది. మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు వార్తా సంస్థలు, వాటి సంపాదకులు, వర్కింగ్ జర్నలిస్టులను కూడా శిక్షించజాలదు.భారతదేశంలో దాదాపు 1,00,000 ప్రచురణలను (రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా ఆమోదించినవి) ఇంగ్లీష్‌తో సహా వివిధ ఫ్రీక్వెన్సీలు, భాషలలో వెలువడుతూ ఉంటాయి. వేలాది పోర్టల్‌లు, వాట్సాప్ ఛానెల్‌లు, ఇతర డిజిటల్ అవుట్‌లెట్‌లతో పాటు దాదాపు 400 ఉపగ్రహ వార్తా ఛానెళ్లకు భారత్ నిలయం. కొవిడ్– 19 మహమ్మారి తర్వాత ఇతర మీడియా సంస్థల ఆధిపత్యం పెరగడంతో భారతీయ వార్తాపత్రికలు, పత్రికలు సహా మ్యాగజైన్ల (అమ్మకాలు, ప్రకటనల నుండి) ఆదాయాలు తగ్గుతూనే ఉన్నాయి. అయితే, సాంప్రదాయ మీడియా నెమ్మదిగా నష్టాల నుంచి కోలుకుంటుందని చాలామంది ప్రింట్ పరిశీలకులు విశ్వసిస్తున్నారు. డిజిటల్ మీడియా నుంచి వినియోగదారులు విశ్వసనీయ సమాచారం కోసం సాంప్రదాయ




మీడియా వైపు మళ్లుతారనీ, పాఠకుల సంఖ్య తిరిగి పెరుగుతుందని భావిస్తున్నారు. 2030 నాటికి ప్రింట్ మీడియా అవుట్‌లెట్‌లు పాఠకుల సంఖ్యను దాదాపు రెండు రెట్లు పెంచుతాయని వారు వాదిస్తున్నారు.ఇటీవల, అనేక మీడియా సంస్థలు పిసిఐ నియమాలలో మార్పులను వ్యతిరేకించాయి. జాతీయ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టులకు బదులుగా వివిధ ప్రెస్ క్లబ్‌ల నుండి సభ్యులను తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ప్రెస్ క్లబ్‌లు సాధారణంగా వినోద కార్యకలాపాల కోసమేనని, వాటి కవరేజ్ ప్రాంతాలు సాధారణంగా ఒక నిర్దిష్ట ప్రాంతం, నగరం లేదా పట్టణానికి కట్టుబడి ఉంటాయని వారు వాదిస్తున్నారు. ప్రెస్ క్లబ్‌లు పని చేయని జర్నలిస్టులకు (విద్యావేత్తలు, రచయితలు, సినీ ప్రముఖులు, దౌత్యవేత్తలు వంటివారు) కూడా సభ్యత్వాలను ఇస్తాయి. అంతేకాకుండా, ప్రెస్ క్లబ్/ ప్రెస్ గిల్డ్/ మీడియా క్లబ్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల ప్రతినిధులు సభ్యులుగా ఉండరు. గుర్తింపు పొందిన జర్నలిస్ట్ యూనియన్లలో సాధారణంగా భారతదేశంలోని చాలా ప్రాంతాల సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార?ండ్, పంజాబ్, చండీగఢ్, హర్యానా, జమ్మూకశ్మీర్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, గోవా, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, సిక్కిం మొదలైన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అనుబంధ సంస్థలను కలిగి ఉన్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్, 23,000 మందికి పైగా సభ్యులకు మద్దతు ఇస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న ప్రొఫెషనల్ స్క్రైబ్‌లకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించింది. ఇంతలో, అవసరమైన అన్ని ప్రమాణాలను నెరవేర్చిన తర్వాత కూడా దాని సభ్యులను చేర్చుకోలేదని ఆల్ ఇండియా వర్కింగ్ న్యూస్ కెమెరామెన్స్ అసోసియేషన్ పిసిఐని సవాలు చేసింది.ఒక నిర్దిష్ట వార్తాపత్రిక/వార్తా సంస్థ లేదా ఎడిటర్/వర్కింగ్ జర్నలిస్ట్ తన వృత్తిపరమైన దుష్ప్రవర్తనతో పాత్రికేయ ప్రమాణాలను దిగజార్చుతోందని ఆరోపిస్తూ వచ్చిన ఫిర్యాదులపై పిసిఐ చర్యలు తీసుకుంటుంది. కాబట్టి, అది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. పత్రికా స్వేచ్ఛకు హామీ ఇవ్వబడిన విషయంలో ప్రభుత్వ ప్రవర్తన సముచితం కాదని తేలితే పరిశీలనలు చేసే అధికారం కూడా దీనికి ఉంది. అందువల్ల కౌన్సిల్‌ను సక్రియం చేసి తిరిగి ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అన్ని రకాల మీడియా సంస్థలను తన పరిధిలోకి తీసుకు వచ్చేందుకు తక్షణమే చర్యలు ప్రారంభించాలి.

## 19న అన్నదాత సుఖీభవ కింద నిధులు జమ

అమరావతి,ఈనెల 19న రెండోవిడత అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. అదేరోజు కేంద్రం పిఎం కిసాన్ పథకం కింద రెండు వేలు విడుదల చేయనుంది. దీంతో రాష్ట్రం కూడా ఐదువేలు తమవంతుగా విడుదల చేయనుంది. ఈ నెల 19న 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న విషయం తెలిసిందే. అదే రోజు పీఎం కిసాన్ పథకం కింద నిధులను కేంద్రం విడుదల చేయనుంది.ఈ నెల 19న వైయస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధుల తో కలిసి రైతుల ఖాతాల్లో నిధులను జమచేయ నున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం రెండో విడత అమలుపై వ్యవసాయ శాఖ అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సమీక్ష నిర్వహించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ జేడీలకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అలాగే.. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యూటేషన్ చేసి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్‌పీసీఏలో ఇన్ యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను యాక్టివేట్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని సులభతరం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడత 46,62,904 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ విడతలో రాష్ట్రం వాటా రూ.5 వేలు, కేంద్రం వాటా రూ.2 వేలు మొత్తం రూ .7 వేలు అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లోకి జమకానున్నాయి. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద రూ.3077.77 కోట్లు రైతుల ఖాతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేయనున్నాయి.

## వచ్చే నెలలో ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణ కేబినె ట్ నేడు భేటీ కానుంది. మధ్యాహ్నం 3గంటలకు సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం ప్రా రంభంకానుంది. ఇందులో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతోపాటు బిసి రిజర్వేషన్ల అమలు, హైకోర్టు తీర్పుతో పాటు మిగతా అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. ఎన్నికల నిర్వహణపై ఈ భేటీలో భాగంగా మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకోనుం ది. రిజర్వేషన్ల పరిమితిపై స్పష్టమైన కోర్టు తీర్పులు ఉండటంతో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వపరంగా అమలు చేయటం ఇబ్బందికరం గా మారడంతో పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.అయితే, ఈ అంశంపై మంత్రివర్గంలో లోతుగా చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే స్థానిక సం స్థల ఎన్నికలపై ఎలా ముందుకెళ్లాలన్న దానిపై మంత్రులతో సిఎం చర్చించనున్నారు. ఈ ఎన్నికలపై మంత్రుల అభిప్రాయాలతో పాటు న్యాయనిపుణుల సలహాలను తీసుకోనున్నారు.మంత్రివర్గం సమావేశం ఎజెండాకు సంబంధించి న సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని సిఎ స్ రామకృష్ణారావు ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయగా హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో నవంబర్‌లో జరగాల్సిన ఎంపిటిసి, జెడ్పీటిసి ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై డిసెంబర్ 7వ తేదీ నాటికి రెండేళ్లు పూర్తి కానుం ది. దీంతో డిసెంబర్ రెండో వారంలో ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించనుంది. అందుకే ఈ ఉత్సవాల తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ప్రభుత్వం కోరే అవకాశం ఉందని సమాచారం. ఉత్సవాల సందర్భంలో షెడ్యూల్ వెలువడితే ప్రజలు, పార్టీ గ్రామీణ క్యాడర్ మొత్తం ఎన్నికల్లో తలమునకలవుతారని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దృష్ట్యా ఎన్నికల ప్రక్రియ డిసెంబర్‌లో ప్రారంభమవుతుందని తెలుస్తోంది.మరోవైపు ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం డిసెంబర్ 8,9వ తేదీల్లో ఫ్యూచర్ సిటీలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025ను నిర్వహించనుంది. దీనికి దేశ, విదేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు హాజరు కానున్నారు. 9వ తేదీన 'తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ఈ సదస్సులో ఆవిష్కరిస్తారు. ఈ నేపథ్యంలోనే ప్రజా పాలన వియోజత్సవాల ప్రణాళిక ఖరారు, సదస్సు నిర్వహణ, విదేశీ ప్రతినిధులకు సౌకర్యాలు, భద్రత, ఏర్పాట్లపై కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పూర్తికావడంతో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో ఇన్ని రోజులపాటు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. గిగ్ వర్కర్ల ముసాయిదాపై కూడా కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం జూబ్లీహిల్స్ గెలుపుతో మంచి జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ. ఇక ఆలస్యం చేయకుండా స్థానిక ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## తెలంగాణ పోలీసుల కృషి అభినందనీయం

హైదరాబాద్,పైరసీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీనటుడు నాగార్జున అన్నారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో సినీ ప్రముఖుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ గురించి నాగార్జున మాట్లాడుతూ తమ కుటుంబంలోనూ ఒకరిని సుమారు రెండు రోజులుపాటు నిర్బంధించారని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు వారు తప్పించుకున్నారన్నారు. తెలంగాణ పోలీసులకు అభినందనలు. ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేసిన తర్వాత చెన్నై నుంచి నా స్నేహితుడు ఫోన్ చేసి ఇక్కడ మేం చేయలేనిది అక్కడ మీరు చేశారన్నాడు. కేవలం రూ.20కోట్ల కోసం నిందితులు ఇదంతా చేయడం లేదు. పైరసీ వెనుక అంతర్జాతీయ ముఠా ఉంది. 50లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా వారికి చేరింది. ఇది బిగ్ ట్రాప్. ఉచితంగా సినిమాలు చూపించాలనేది వారి ఉద్దేశం కాదు. దీనిలో రూ.వేల కోట్లు దోచేసే పెద్ద ప్లాన్ ఉంటుంది. సినిమాలు ఫ్రీగా చూస్తున్నామని అనుకోవద్దు.. దాని వెనుక ఉన్న పెద్ద మోసాన్ని గమనించాలని నాగార్జున అన్నారు. తెలంగాణ పోలీసులు సినీ పరిశ్రమకు చెందిన వారి పరిస్థితి మరికొంత మెరుగుపడేలా చేశారని నిర్మాత సురేశ్‌బాబు అన్నారు. పైరసీ సినిమాలు చూడొద్దని.. ఏదీ ఉచితంగా రాదని చెప్పారు. మన డేటా వారి వద్ద ఉండటంతో ఎన్నో నేరాలకు పాల్పడతారన్నారు. ఉచితంగా సినిమా చూడటం వల్ల ఇవన్నీ జరుగుతాయని సురేశ్‌బాబు అన్నారు.

# పైరసీ ద్వారా వ్యక్తిగత సమాచారం కూడా చోరీ

హైదరాబాద్,సినీ ఇండస్ట్రీ మీద చాలామంది ఆధారపడి ఉన్నారని వాళ్ల కష్టాన్ని దౌర్జన్యంగా దోచుకుంటుంటే బాధగా ఉంటుందని చిరంజీవి అన్నారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ నేపథ్యంలో తాజాగా సినీ ప్రముఖులు హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. ఈ మీటింగ్ అనంతరం చిరంజీవి మాట్లాడారు. అంతకుముందు సౌదీ ప్రమాదంలో మృతులకు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ పైరసీ నుంచి ఎలా తప్పించుకోవాలని ఆలోచిస్తూనే ఉన్నాం. ఇండస్ట్రీ మీద పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షల మంది ఆధారపడి ఉన్నారు. లైట్‌బాయ్ దగ్గర నుంచి పెద్దపెద్ద డైరెక్టర్ల వరకూ ఇండస్ట్రీపై ఆధారపడి ఉన్నారు. ఇంతమంది కష్టాన్ని ఒకడు దౌర్జన్యంగా దోచుకోవడం.. తిరిగి పోలీసులకే సవాలు విసరడాన్ని తట్టుకోలేకపోయాం. ఇలాంటి సమయంలో గత సీపీ సీవీ ఆనంద్ అనంతరం సజ్జనార్ చాలా కృషి చేసి నిందితుడిని పట్టుకున్నారు. ఈ కేసులో పనిచేసిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ప్రజలు కూడా సినిమా తమదిగా భావించాలి, పైరసీ చూడొద్దు. ఈ ఏడాది కూడా చాలా సినిమాలు పైరసీ చేశారు. దీనివల్ల ఎంతో నష్టం జరిగింది. త్వరలో రాజమౌళి గొప్ప సినిమా తీయనున్నారు. అప్పుడు మన ఖ్యాతి ఖండాంతరాలు విస్తరిస్తుంది. ఆ సమయంలోను పైరసీ పెనుసవాలుగా ఉంటుంది. ఇండస్ట్రీ బాధను అర్థం చేసుకున్నందుకు పోలీసులను అభినందిస్తున్నట్లు చిరంజీవి అన్నారు. పోలీసులకు ధన్యవాదాలు. ఇది సినిమాలో సూపర్ హిట్ సన్నివేశంలా ఉంది. విలన్ ఛాలెంజ్ చేస్తే రెండు నెలల తర్వాత హీరో అతడిని కటకటాల వెనక వేసినట్లు ఉంది. భస్మాసురుడి హస్తంలా తన తలమీద తనే చేయిపెట్టుకున్నాడు. పోలీసులతో ఆటలొద్దు. ఈ సందర్భంగా ఒక్కటే చెప్పాలనుకుంటున్నా.. ఏదీ ఉచితంగా రాదు. ఒకవేళ అలా వస్తే దాని వెనక పెద్ద ప్రమాదం పొంచి ఉంటుంది. అది చావు వరకూ తీసుకెళ్తుంది. 'సినిమాలేగా ఏముంది ఫ్రీగా చూస్తున్నాం' అని అందరూ అనుకుంటున్నారు. పైరసీ చేసే వాళ్లేం సంఘసేవ చేయడం లేదు. పెద్దపెద్ద సర్వర్లు ఉపయోగించి పైరసీ చేస్తున్నారు. దానికి డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది? మేము వాళ్లకు డబ్బులు ఇవ్వడం లేదు.. మా సినిమాలను పైరసీ చేసి సంపాదిస్తున్నారు. అంటే మీరు ఇస్తున్నారు. మీ వ్యక్తిగత డేటాను అమ్మడం వల్ల ఇస్తున్నారు. ఈ పర్సనల్ డేటా అంటే చాలా మందికి తెలియకపోవచ్చు. మీ పేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ ఉంటే చాలు మీరు సైబర్ బారిన పడతారు. ఈ డేటాను క్రిమినల్స్‌కు అమ్ముతున్నారు. మీరు నంబరే కదా అని ఎంటర్ చేస్తున్నారు. దాని మూలంగా ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయి. డబ్బులు పోవడమే కాదు.. ప్రాణాలు పోయే వరకూ వెళ్తోంది. ఈ పైరసీ వల్ల మాకంటే మీరే ఎక్కువ నష్టపోతున్నారు. అర్థం చేసుకోండి. ఇలాంటి పైరసీ వెబ్‌సైట్లలో ఉచితంగా సినిమాలు చూసి ఇబ్బందుల్లో పడకండని రాజమౌళి సినీ అభిమానులకు సూచించారు.

# ముగ్గురు మిత్రుల కథ !

న్యూఢిల్లీ,కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అప్రతిహత విజయాలతో దూసుకుని పోతోంది. 2024లో అధికారంలోకి మూడవసారి వరసగా వచ్చింది. ఆ తరువాత కేవలం పద్దెనిమిది నెలలల పాలనలో దేశంలో జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించింది. హర్యానా మహారాష్ట్ర ఢిల్లీ తాజాగా బీహార్ ఇలా ఫలితాలు అన్నీ ఎన్డీయేకు అనుకూలంగా రావడంతో ఆనందానికి అవధులు లేవు. ఇక ఎన్డీయేలో ముగ్గురు మిత్రుల బంధం మరింతగా ఈ విజయాలతో బలపడుతోంది. ఆ ముగ్గురు మిత్రులు ఎవరూ ఏమా కథ అంటే వెరీ ఇంట్రెస్టింగ్.

సమ వయస్కులుగా :

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ ఏపీ సీఎం చంద్రబాబు, బీహార్ సీఎం నితీష్ కుమార్ ముగ్గురూ మంచి మిత్రులు. పైగా సమ వయస్కులు. వీరంతా ఏడున్నర పదుల వయసులో ఉన్నారు. ఇక వీరి రాజకీయ జీవితం సైతం దశాబ్దాలుగా ఉంది. ఇక ఈ ముగ్గురి మధ్య గతంలో కొన్ని పొరపొచ్చాలు వచ్చినా ఇపుడు వచ్చే చాన్సే లేదు అని అంటున్నారు. నానాటికీ ఈ బంధం మరింతగా పటిష్టం అవుతోంది అని విశ్లేషిస్తున్నారు.

అనుభవాలే పాఠాలు :

టీడీపీ 2018లో ఎన్డీయేని వీడి 2019 ఎన్నికల్లో ఓటమి పాలు అయింది అది ఒక చేదు అనుభవం. ఓటమి చెందగానే దానిని టీడీపీ అధినాయకత్వం గ్రహించింది. తిరిగి సరిచేసుకుంది. బీజేపీ జట్టులోకి ఎట్టకేలకు చేరగలిందింది. 2024 ఎన్నికల్లో వాటి అద్భుత ఫలితాను కూడా అందుకుంది. ఇపుడు టీడీపీ బీజేపీని వీడిపోవడం అన్నది కలలో కూడా చేసేది లేదని అంటున్నారు. బాబు అయితే బీహార్ ఎన్నికల ఫలితాల తర్వాత చేసిన వ్యాఖ్యలు మోడీ పట్ల ఆయనకు ఉన్న అభిమానాన్ని నమ్మకాన్ని తెలియచేసేలా ఉన్నాయి. దేశంలో ఇప్పటిదాకా మోడీ అంత ప్రజదరణ ఉన్న నాయకుడు ఎవరూ లేరని చాలా గొప్పగా చెప్పారు. ఇక 2029 ఎన్నికల్లో మోడీ బాబు జోడీ వెరీ సక్సెస్ ఫుల్ గా సాగడం ఖాయమని అంటున్నారు.

నితీష్ సైతం :

మరో వైపు చూస్తే నితీష్ కుమార్ కూడా బీహార్ లో ఒకసారి మోడీని ఎన్డీయేని విడిచి దూరం జరిగారు. ఆయన 2020లో బీజేపీతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చారు. కానీ 2022 ప్రాంతంలో మాత్రం బీజేపీని వదిలేసి ఆర్జేడీతో చేరిపోయారు ఆ సమయంలోనే ఇండియా కూటమిని ఏర్పాటు చేయడంలో నితీష్ కుమార్ కీలక పాత్ర పోషించారు. అయితే ఇండియా కూటమిలో తనకు సరైన ప్రాధాన్యత దక్కకపోవడంతో పాటు మోడీ చరిష్మాను చూసిన మీదట నితీష్ మళ్ళీ వెనక్కి వచ్చారు. ఆ సందర్భంగా ఆయన అన్న మాట ఏంటి అంటే మోడీతోనే ఎప్పటికీ జట్టు. ఇదే నా ఒట్టు అని. ఇక తాజాగా బీహార్ లో జరిగిన ఎన్నికల్లో బీజేపీతో కలసి జేడీయూ పోటీ చేసి గతంలో ఎన్నడూ సాధించని సీట్లు సాధించింది. దీంతో నితీష్ కుమార్ కూడా ఫుల్ హ్యాపీ. మోడీని ఆయన ఎంతో ఆరాధన భావంతో పాటు ఒక ప్రియమైన స్నేహితుడిగా చూస్తూ వస్తున్నారు. దానికి గతంలో ఇద్దరూ బీహార్ లో పాల్గొన్న సభలే ఉదాహరణ. మోడీ ప్రసంగిస్తూంటే చప్పట్లు కొట్టమని జనాలను కోరడమే కాదు మోడీ కనిపిస్తే చాలు గురూజీ అంటూ ఏకంగా సాష్టాంగ ప్రణామాలే చేస్తూ వస్తున్నారు.

ప్రియమైన స్నేహం :

ఇక నరేంద్ర మోడీ అయితే నితీష్ ని తన ముఖ్య స్నేహితుడిగా భావిస్తూ ఆయనను ఆలింగనం చేసుకుంటూ తన స్నేహ బంధం ఎంత గొప్పదో తెలియచేస్తున్నారు. ఇక ఏపీ సీఎం చంద్రబాబు విషయం తీసుకుంటే ఆయనకు ఎంతో గౌరవం మర్యాద ఇస్తూనే తమ మిత్రుత్వాన్ని చాటుతున్నారు. సీనియర్ నేత బాబు అని ఏపీలో పలు వేదికల మీద మోడీ చెప్పిన మాట ఆయన గుండె లోతుల్లో నుంచి వచ్చినదే. మొత్తం మీద ఈ ముగ్గురు స్నేహితులూ ఒకరి గురించి మరొకరు పూర్తిగా తెలుసుకున్నారు. తిరిగి కలుసుకున్న తరువాత ఈ స్నేహ బంధం శాశ్వతం అని గట్టిగా చెప్పుకుంటూ ముందుకు కదులుతున్నారు. రాజకీయంగా ఎన్నో చూసిన ఈ మిత్ర త్రయం తమ స్నేహాన్ని అలాగే కొనసాగిస్తారని అంతా అనుకుంటున్న మాట. ఈ ముగ్గురూ వారి వ్యూహాలు చాణక్యాలు కనుక కలసి ఉంటే మాత్రం ప్రత్యర్థులకు చుక్కలే అన్నది రాజకీయ విశ్లేషకుల మాట.

# ఎన్నిక వైపా? కాలయాపనా! దానం, కడియం దారెటు?



హైదరాబాద్,బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలలో దానం నాగేందర్, కడియం శ్రీహరి తీరు ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీలోకి ఫిరాయించిన విషయం తెలిసిందే. ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ఉన్నారు. ఈ పది మంది ఎమ్మెల్యేలపై సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారణ చేపట్టారు. పది మంది ఎమ్మెల్యేలలో ఇప్పటి వరకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలను రెండు దశల్లో విచారించారు. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు హాజరుకాలేదు. స్పీకర్ నోటీసులకు ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు జవాబు ఇవ్వలేదు. తాము సమాధానం ఇచ్చేందుకు సమయం కావాలని కోరినట్లు, ఈ మేరకు స్పీకర్ సానుకూలంగా స్పందించారని, సమయాన్ని బట్టి తమ స్పందన ఉంటుందని చెబుతూ వస్తున్నారు. ప్రస్తుతం ఎనిమిది ఎమ్మెల్యేలపై విచారణ శనివారానికి ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు ఇంకా స్పందించక పోవడంలో 'మర్మమేమిటనే' చర్చ ప్రారంభమైంది. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడి బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న సందర్భం, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితుల్లో ఈ ఇద్దరు ఎమ్మెల్యేల దారెటు అనే చర్చ సాగుతోంది.

నిర్ణయంపై ఉత్కంఠ

శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్ తన చాంబర్‌లో భద్రాచలం, జగిత్యాల ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, సంజయ్ కుమార్ పిటిషన్‌లపై విచారించారు. తొలి విడతలో నలుగురు ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్‌లను విచారించారు. రెండో విడతలో నలుగురు ఎమ్మెల్యేలు సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీలను విచారించారు. అయితే అనర్హత అభియోగాలు ఎదుర్కొంటున్న మరో ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం స్పీకర్ నోటీసులకు సమాధానం ఇవ్వలేదు. దీంతో ఈ ఇద్దరి అనర్హత అంశంపై విచారణ జరుగలేదు. నోటీసులకు స్పందించని ఇద్దరి ఎమ్మెల్యేల నిర్ణయం ఏ విధంగా ఉంటుందనే ఉత్సుకత రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. మరో వైపు సోమవారం సుప్రీంకోర్టులో అనర్హత పిటిషన్ పై విచారణ ఉన్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఎన్నికల వైపా? కాలాయాపన?

దానం నాగేందర్, కడియం శ్రీహరి ఈ ఫిరాయింపుల వ్యవహారంపై స్పష్టమైన అవగాహనతో అడుగులువేస్తున్నట్లు భావిస్తున్నారు. ముందు జాగ్రత్తతో పాటు ముందస్తు వ్యూహంతో ఉన్నట్లు చర్చసాగుతోంది. బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. దీంతో ఆయన కాంగ్రెస్ ముద్ర నుంచి తప్పించుకునేందుకు అవకాశం తక్కువనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక స్టేషన్ ఘన్ పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ ఎంపీగా తన కుమార్తె కడియం కావ్య బరిలో నిలిచినప్పుడు పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. కాంగ్రెస్ సమావేశాలు, సభల్లో పాల్గొన్నారు. ఇప్పటికీ ఆయన కాంగ్రెస్ పార్టీ ఆఫీసుల్లో మీటింగులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయనకు కూడా కాంగ్రెస్ ముద్ర నుంచి తప్పించుకునేందుకు అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో 'సాగదీత' దోరణితో కలిసివచ్చినంత కాలం కానిచ్చి ఆ తర్వాత పరిస్థితి విషమించి, కోర్టుల నిర్ణయం, స్పీకర్ వేటు పడే అవకాశం ఉంటే 'ముందస్తు' రాజీనామాకు సైతం మానసికంగా సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇది కాకుండా కాలం కలిసొచ్చి ప్రస్తుత పది మందికి తోడు 'శాసనసభా పక్ష విలీనానికి' అవసరమైన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి ఫిరాయిస్తే ఎవరూ రాజీనామా చేయాల్సిన అవసరం ఉండదనే మరో ప్లాన్‌తో ఉన్నట్లు చెబుతున్నారు. తాజాగా జూబ్లీ హిల్స్ ఎన్నికల విజయం నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి మరి కొంత మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారనే ప్రచారం అప్పుడే మొదలైంది. ఇది నిజమైతే ఎన్నికలు రాకుండానే పార్టీ మారేందుకు రాజమార్గం ఏర్పడుతోందంటున్నారు. ఉప ఎన్నికల వ్యూహంతోనే తమ నియోజకవర్గాల్లో అభివృద్ధికి నిధులు తెచ్చి పనులు చేస్తున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా కడియం లాంటి వారు తమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఉప ఎన్నిక అనివార్యమైతే ఈ అభివృద్ధియే తమ విజయానికి దోహదం చేస్తుందనే భరోసాతో ఉన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ కూడా కడియం లాంటి వారికి నిధులు భారీగా కేటాయిస్తున్నారు. తాజా జూబ్లీ ఎన్నికల గెలుపు వీరిలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచినట్లు చెబుతున్నారు. రాజీనామా తప్పనిసరైతే రాష్ట్రంలో మరో ఉప ఎన్నిక వచ్చే అవకాశం లేకపోలేదంటున్నారు. రాజకీయాల్లో తలపండిన నాయకులు కావడంతో ఆచితూచి అడుగులేస్తున్నారు.

# ఉగ్రవాద నిర్మూలనకు బహుముఖ వ్యూహం

న్యూఢిల్లీ,పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతిచర్యగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది. పాకిస్థాన్‌తోపాటు, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్ర స్థావరాలను తుత్తునియలు చేసి, ముష్కరులను మట్టుపెట్టారు. పాక్ ఎదురుదాడి యత్నాలను భారత్ వమ్ముచేసి సత్తా చాటింది. భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడి జరిగితే వెంటనే చావుదెబ్బతీస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. ఉగ్రదాడులు పాక్ ప్రభుత్వ ప్రోద్బలంతో జరిగినా, ఉగ్రవాదులే స్వయంగా దాడులు చేపట్టినా ఉభయులనూ జవాబుదారులుగా చేస్తామన్నారు. భారత్ దృఢ వైఖరిని ప్రకటించి భద్రతా బందోబస్తును ముమ్మరం చేసినా దిల్లీలో ఉగ్రవాదుల వల్ల విస్ఫోటనం సంభవించింది. దీనికి బాధ్యులైనవారు వైద్యులు, ఉన్నత విద్యావంతులు కావడం, వారికి పాక్ ఉగ్ర సంస్థ జైషే మహమ్మద్‌తో సంబంధాలు ఉండటం దిగ్భ్రాంతికరం. ఆపరేషన్ సిందూర్ తరవాత ఉగ్రవాదులు భారత్‌లో విధ్వంసం సృష్టించడానికి 22సార్లు ప్రయత్నించి విఫలమయ్యారని అధికారులు చెప్పారు. అయినా దిల్లీ ఎర్రకోట వద్ద ఒక కారులోని పేలుడు పదార్థాల విస్ఫోటనంతో అమాయకులు మరణించారు. అంతకుముందే సోదాల్లో 2900 కిలోల పేలుడు పదార్థాలు పట్టుబడ్డాయి. ఆపరేషన్ సిందూర్‌లో జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయం, శిక్షణ శిబిరాలు నాశనమైన తరవాత ఆ సంస్థ మళ్లీ శక్తులు కూడదీసుకుంటోంది. భారత్ దాడిలో జైష్ అధిపతి మసూద్ అజహర్ సోదరి సయీదా అజహర్ భర్త హతమయ్యాడు. దాంతో సయీదా నాయకత్వంలో మహిళా ఉగ్రవాదుల బృందం ఏర్పాటైనట్లు వార్తలొచ్చాయి. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన మౌలిక వసతులను పునర్నిర్మించుకోవడానికి జైష్ సుమారు నాలుగు వందల కోట్ల రూపాయల నిధిని సమీకరిస్తోంది. భారత వ్యతిరేక ఉన్మాదంతో రగిలిపోతున్న జైష్‌తోపాటు, అలాంటి ఇతర ఉగ్ర సంస్థల పట్ల ఇండియా అప్రమత్తంగా ఉండాలి.

ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం

ఎర్రకోట వద్ద పేలుడులో జైష్‌తో పాటు తుర్కియే వంటి విదేశీ శక్తుల పాత్ర ఎంత అనేది నిగ్గుతేల్చాలి. వైద్యులు, ఉన్నత విద్యావంతుల్లో కూడా ఉగ్రవాద భావజాలం ఎలా ప్రవేశించిందో ఆరా తీయాలి. కశ్మీర్ సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఏవైనా రహస్య ఉగ్ర ముఠాలు ఉన్నాయా అన్నదీ శోధించాలి. ఆర్డీఎక్స్, అమోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలు ముష్కరుల చేతికి ఎలా అందుతున్నాయో కనిపెట్టాలి. ఎక్కడెక్కడ ఉగ్రవాదాన్ని ఎలా నూరిపోస్తున్నారో ఆరా తీయాలి. ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న స్థానికులెవరో గుర్తించాలి. ఇంటెలిజెన్స్ వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలి. అయిదేళ్ల కాలంలో జరిగిన పేలుళ్లు, హింస, క్షతగాత్రులు, హతులు, బందీలను పట్టుకున్న ఘటనల ఆధారంగా ముష్కరుల తీవ్రతను అంతర్జాతీయ ఉగ్రవాద సూచీపై గణిస్తారు. ఆ మేరకు 98 ఉగ్రపీడిత దేశాలకు ర్యాంకులిస్తారు. 2024 సూచీలో 8.5 స్కోరుతో బుర్కినా ఫాసో అగ్రస్థానం ఆక్రమించగా పాకిస్థాన్ తదుపరి స్థానంలో నిలిచింది. 6.4 స్కోరుతో భారత్ 14వ స్థానం ఆక్రమిస్తోంది. ఆధునిక ఉగ్రవాదం బాంబు పేలుళ్లు, తుపాకులకే పరిమితం కావడం లేదు. కృత్రిమ మేధ(ఏఐ) వంటి అధునాతన సాంకేతికతలనూ ఉగ్రవాదులు విరివిగా వాడుతున్నారు. సైబర్ దాడులకు పాల్పడుతున్నారు. డ్రోన్లతో దాడులు, వాటి ద్వారా మందుగుండు, తుపాకులు పంపడం వంటివి చేస్తున్నారు. దీన్ని ఎదుర్కోవడానికి భారత్ డ్రోన్ నిరోధక యూనిట్లు, సాంకేతికతలతో సిద్ధంగా ఉండాలి. సైబర్ దాడుల నుంచి భద్రత ఏర్పరచుకోవాలి. సైన్యం ఏఐని సమర్థంగా



ప్రయోగించాలి. టెక్నాలజీ కంపెనీలకూ, ఇంటెలిజెన్స్ సంస్థలకూ మధ్య సమన్వయ, సహకారాలను పెంపొందించాలి. శత్రువు జరిపే మానసిక యుద్ధాన్ని ఎదుర్కోవడంతోపాటు మనమూ అలాంటి యుద్ధాన్ని సమర్థంగా చేపట్టాలి. భారత్ రకరకాల ఉగ్రవాదాలను ఎదుర్కొంటోంది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ కశ్మీర్‌లో, ఇతర ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాలని చూస్తోంది. ఈశాన్య భారతంలో భారత్ నుంచి విడిపోతామనే వేర్పాటువాద ఉగ్రవాదమూ కనిపిస్తోంది. వామపక్ష తీవ్రవాదం ఇటీవలి కాలంలో తగ్గుముఖం పట్టినా మాదకద్రవ్య ఉగ్రవాదం పెరుగుతోంది. ఈ ముప్పును నిర్వీర్యం చేయడానికి వివిధ భారతీయ భద్రతా సంస్థలు, గూఢచార సంస్థలు నిత్యం కృషి చేస్తున్నాయి. ఉగ్రవాదం దేశ ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం చూపుతుంది. పర్యాటకాన్ని దెబ్బతీసి స్థానికుల ఆదాయాలకు గండికొడుతుంది. ఉగ్రదాడుల నిరోధానికి ప్రభుత్వం భారీగా డబ్బు వెచ్చించాల్సి వస్తుంది. ఉగ్రదాడుల వల్ల భారతీయ సమాజంలో అపనమ్మకాలు, భయాందోళనలు పెరిగిపోతాయి. దౌత్యపరంగా విషమ ప్రభావం ప్రసరిస్తుంది.

దృఢ సంకల్పం కీలకం

దిల్లీ ఎర్రకోట వద్ద పేలుడు మన భద్రతా వ్యవస్థ మరింత జాగరూకత చూపాల్సిన ఆవశ్యకతను చాటిచెబుతోంది. ఉగ్ర భావాలను నూరిపోస్తున్న విద్యాలయాలపై కన్నువేసి, ఎక్కడికక్కడ అడ్డుకోవాలి. అన్ని సంస్థలనూ జవాబుదారులను చేయాలి. పేలుడు పదార్థాల నిల్వ, విక్రయంపై కఠినమైన నియంత్రణ విధించాలి. రసాయనాలపై పరిశోధనలు జరిపే సంస్థల్లో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలి. ఉగ్రవాదులకు నిధులు అందకుండా కట్టడి చేయాలి. ఉగ్రవాదంపై పోరాటం కేవలం భద్రతా సంస్థల బాధ్యత మాత్రమే కాదనీ... ప్రజలు, ప్రభుత్వం సదా అప్రమత్తంగా ఉండాలనీ గ్రహించాలి. ఈ పోరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చురుగ్గా పాలుపంచుకోవాలి. ఇక్కడ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ప్రబోధాన్ని పునరుల్లేఖించాలి. 'ఉగ్రవాదాన్ని నిర్మూలించాలంటే సమాజంలో వివిధ వర్గాల మధ్య- ముఖ్యంగా యువతలో అసమానతలు, విభేదాలను తొలగించాలి. ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించి, మంచి ఉపాధి అవకాశాలు కల్పించాలి. మతమనేది ఉన్నత ధార్మిక చింతనగా పరిణామం చెందాలి. ఆకలి, విద్వేషాలు లేని ఆదర్శ, ఆధునిక సమాజంగా భారత్ పరిణతి చెందాలి'. ఉగ్రవాదంపై విజయం బుల్లెట్లు, నిఘా ద్వారా మాత్రమే సిద్ధించదు. విద్య, సమానత్వం, దృఢమైన జాతీయ సంకల్పమూ కీలకమేనన్న సంగతిని గుర్తించాలి.

# సైబర్ క్రైమ్ పోలీసుల కృషి అభినందనీయం

హైదరాబాద్,ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. పోలీసులకు దమ్ముంటే తనను పట్టుకోవాలని కొన్ని రోజుల ముందు ఇమ్మడి రవి సవాల్ చేశాడు. ఆయన కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇమ్మడి రవి అరెస్ట్‌పై తెలంగాణ రాష్ట్ర హోం శాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్ స్పందించారు. రవి అరెస్ట్‌పై సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీవీ ఆనంద్ ట్వీట్ పెట్టారు.దమ్ముంటే పట్టుకోండి అన్నోడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారని సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అభినందనలు తెలిపారు. ఇమ్మడి రవిని పట్టుకోవడానికి జూన్ నుంచి సైబర్ క్రైమ్ టీమ్ రేయింబవళ్లు కష్టపడిందని ప్రశంసించారు. రవిని తప్పా ఈ పైరసీకి సంబంధించిన వాళ్లందరినీ పట్టుకుందని గుర్తుచేశారు. దమ్ముంటే పట్టుకోండని పోలీసులకు సవాలు విసిరి, బెదిరించిన వ్యక్తిని ఇప్పుడు అరెస్టు చేశారని కొనియాడారు. డీసీపీ కవిత, హైదరాబాద్ సీపీ సజ్జనార్‌లని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు సీవీ ఆనంద్.

# పోలీసులకు సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు

అమరావతి, పోలీసులకు సైతం సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుబృందం, హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమవడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతోషం వ్యక్తంచేశారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ నేపథ్యంలో తాజాగా సినీ ప్రముఖులు హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. వారంతా పోలీసుశాఖకు ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలో పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. డబ్బుల రూపంలోనే కాదు, సృజనాత్మకతనూ పెట్టుబడిగా పెట్టి నిర్మించే సినిమాలు విడుదలైన రోజే ఆన్‌లైన్‌లోకి వచ్చేస్తున్నాయి. దీనివల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది. సినిమా విడుదలే ఒక మహాయజ్ఞంగా మారిపోయిన తరుణంలో పైరసీ ముఠాలను కట్టడి చేయడం దర్శకనిర్మాతలకు సాధ్యం కావడం లేదు. పైరసీలో కీలకంగా ఉన్న ఐబొమ్మ, బప్పమ్ వెబ్‌సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, వాటిని మూయించివేయడం స్వాగతించదగ్గ పరిణామం. పోలీసులకు సైతం సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుబృందం చేసిన ఆపరేషన్ విజయ వంతమైంది. ఈ ఆపరేషన్‌లో భాగమైన పోలీసులకు, సిటీ కమిషనర్ వి.సి.సజ్జనార్‌కి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. బెట్టింగ్ మాఫియా, పోంజీ స్కీమ్స్ లాంటివాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వాటివల్ల ప్రజలు ఏవిధంగా ఆర్థికంగా చితికిపోతున్నారో చైతన్యపరుస్తున్నారు. పోంజీ స్కీమ్స్ మూలంగా ప్రజలు ఆర్థికంగా ఏవిధంగా మోసానికి గురై నష్టపోతున్నారో ఆయన ఓ సందర్భంలో వివరించారు. అలాగే బెట్టింగ్ యాప్స్‌ను నియంత్రించేందుకు సజ్జనార్ చేపట్టిన కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లోనూ కదలిక తీసుకువచ్చింది. ఆయన నేతృత్వంలో చేపట్టే చర్యలు కచ్చితంగా తెలుగు సినిమాకే కాదు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయని పవన్‌కల్యాణ్ ప్రశంసించారు. పైరసీతో సినీరంగానికి చాలా నష్టం జరిగిందని, దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

# దిశా నిర్దేశం...

హైదరాబాద్,జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చాలా ప్రతిష్టగా తీసుకున్నారు. ఒక విధంగా ఇది తన ఇమేజ్ ని పెంచేదిగా చేస్తుందని తలచారు. అవతల వైపు సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. ఆయనతో ఢీ కొట్టి సక్సెస్ కొడితే చాలు ఇక బీ ఆర్ ఎస్ కారు జోరుని ఆపడం ఎవరి తరం కాదని కేటీఆర్ బాగానే స్కెచ్ గీసారు. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకూ ఎత్తులు పై ఎత్తుల దాకా అన్నీ తానై నడిపించారు. కానీ ఫలితం చూస్తే తేడా కొట్టింది. అయితే ఊరట ఏమిటి అంటే ఇంతటి ఓటమిలోనూ బీఆర్ఎస్ కి 75 వేల దాకా ఓట్లు రావడం చాలా ప్యాకెట్లలో పాత బలం పదిలపరచుకోవడం, కాంగ్రెస్ ని ఢీ కొట్టే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అని జనాలకు రుజువు చేయడం.

పెద్దాయన సలహా :

ఇక ఓటమి తరువాత కేటీఆర్ మీద విమర్శల వర్షమే కురిసింది. సీఎం రేవంత్ రెడ్డి అయితే అహంకారాన్ని కేటీఆర్ తగ్గించుకోవాలని అన్నారు. కేసీఆర్ ది వయోభారమని కారు పార్టీ స్టీరింగ్ తిప్పడం కేటీఆర్ హరీష్ రావు వల్ల కాదని కూడా సెటైర్లు పేల్చారు. ఇక కేసీఆర్ తనయ, కేటీఆర్ చెల్లెలు అయిన కవిత కూడా కర్మ రిటర్న్స్ అంటూ సెటైరికల్ ట్వీట్ ని పెట్టింది. దాంతో కేటీఅర్ విషయంలో ఆయన నాయకత్వం విషయంలో చర్చ సాగుతుందని అనుకున్నారు కానీ అలా జరగలేదు, ఓటమి తరువాత నేరుగా ఫాం హౌస్ కి వెళ్ళి పెద్దాయన తన తండ్రి అయిన కేసీఅర్ తో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆయన నుంచి సలహాలు తీసుకున్నారు అని అంటున్నారు.

జిల్లాల టూర్లు :

కేటీఅర్ జూబ్లీ హిల్స్ లో చేసిన ప్రచారం కానీ పడిన కష్టం కానీ కేసీఅర్ గుర్తించారు అని అంటున్నారు. అయితే ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపు అన్నది సహజం అన్నది కూడా ఉంది. పైగా మొత్తం ప్రభుత్వమే ఒక ఉప ఎన్నిక విషయంలో అంతా తామై గట్టిగా కృషి చేసింది అని కూడా విశ్లేషణలు ఉన్నాయి. దాంతో పాటు ఈ ఉప ఎన్నికలలో బలంగా పోరాడిన పార్టీగా కాంగ్రెస్ కి సిసలైన ఆల్టర్నేషన్ గా బీఆర్ఎస్ ఉందని కూడా అంటున్నారు. దాంతో ఇదే అదనుగా జిల్లాల టూర్లు చేపట్టాలని కేసీఆర్ కేటీఆర్ కి సూచించారు అని అంటున్నారు. త్వరలో స్థానిక ఎన్నికలు తెలంగాణాలో జరగబోతున్నాయి. దాంతో పార్టీని పటిష్టం చేయాలని దిశా నిర్దేశం చేశారు అని అంటున్నారు.

కీలక సమావేశం :

ఇదిలా ఉంటే మంగళవారం కేటీఆర్ తెలంగాణా భవన్ లో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశం అవుతారు అని అంటున్నారు. బీఆర్ఎస్ జూబ్లీ హిల్స్ లో ఓటమి తరువాత పరిస్థితులను చర్చించడంతో పాటు స్థానిక ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో కూడా ఇదే సమావేశంలో ఆలోచిస్తారు అని అంటున్నారు. అంతే కాకుండా జిల్లాల పర్యటనలకు కేటీఆర్ సిద్ధపడతారని దానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తారు అని అంటున్నారు. ఇక మీదట జిల్లాల పర్యటనలోనే పార్టీని బలోపేతం చేసే విషయం కూడా కేటీఆర్ ఫోకస్ పెట్టి మొత్తం గ్రౌండ్ లెవెల్ రిపోర్ట్ ని కేసీఆర్ కి ఇస్తారు అని అంటున్నారు.

మొత్తం మార్పులు :

ఇక కేసీఆర్ కూడా పార్టీలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుడతారు అని అంటున్నారు. టాప్ టూ బాటం కొత్త నాయకత్వాన్ని నియమించడం పనిచేసే వారికి చోటు కల్పించడం ద్వారా బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా పటిష్టం చేయడానికి రెడీ అవుతున్నారు అని అంటున్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికతో నిరుత్సాహం పడకుండా శ్రేణులు అన్నీ ముందుకు సాగేలా కేసీఆర్ పార్టీకి కొత్త జవజీవాలు అందిస్తారు అని అంటున్నారు.

# కొత్త మిత్రులు వస్తారా ?

అమరావతి,వైసీపీ కాంగ్రెస్ కి వ్యతిరేకంగా ఏర్పాటు అయిన పార్టీ. ఆ విషయాన్ని ఆ పార్టీ నేతలు ఎన్నో సార్లు చెప్పారు కూడా. లేటెస్ట్ గా చూస్తే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కూడా ఇండియా కూటమి అభ్యర్థిని పక్కన పెట్టి ఎన్డీయే అభ్యర్థికి వైసీపీ ఓటు చేసింది. ఇక జగన్ ని జైలు పాలు చేయించిందని కేసులు అక్రమంగా పెట్టిందని కాంగ్రెస్ మీద వైసీపీ అధినాయకత్వానికి కోపం ఉందని అంటారు. అది ఎప్పటికీ తీరని ఆరని కోపంగానే ఉంది అని అంటున్నారు.

కాంగ్రెస్ ఏపీ ఫోకస్:

ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ మళ్ళీ కోలుకోవాలని, పునర్ వైభవం కలగాలని ఆ పార్టీ నేతలు గట్టిగా కోరుకుంటున్నారు. కాంగ్రెస్ వివిధ రాష్ట్రాలలో అధికారం కోల్పోవడానికి బలమైన నేతలు పార్టీని వీడడం కారణం అని అంటున్నారు. ముఖ్యంగా సౌత్ లో తీసుకుంటే పాతిక ఎంపీ సీట్లు ఉన్న ఏపీలో వైసీపీని జగన్ స్థాపించాక కాంగ్రెస్ కుదేల్ అయింది. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలో ఉంది, తమిళనాడులో మిత్రుల పొత్తుతో కొనసాగుతోంది. కేరళలో తన కంటూ బలం ఉంది. కర్ణాటకలో అధికారంలో ఉంది. ఈ విధంగా చూస్తే సౌత్ లోనే కాంగ్రెస్ కి ఎక్కువ బలం ఉంది, ఆశలు ఉన్నాయి.

# మౌనంగానే శిక్షిస్తున్నారు.. నోరు విప్పాలంటే దడే.. !



అమరావతి,టీడీపీ నేతల్లో కొందరు హద్దులు మీరారు. నోటికి ఎంత మాట పడితే అంత మాట మాట్లాడారు. మరికొందరు అంతర్గత చర్చల్లో చెప్పాల్సిన విషయాలను బహిరంగం చేశారు. తద్వారా ఏదో సాధించాలని అనుకున్నారు .ఇవన్నీ గత మూడు మాసాలుగా రచ్చలుగా మారాయి. పార్టీచుట్టూ వివాదాలు కూడా చోటు చేసుకున్నాయి. అయితే.. వీటిని పట్టించుకున్నట్టే వ్యవహరించిన పార్టీ అధిష్టానం.. నివేదికలు తెప్పించుకుంది. ఇక చర్యలు ఉంటాయని భావించినప్పటికీ.. పార్టీ మౌనంగా ఉంది.నిజానికి మౌనానికి మించిన శిక్ష మరొకటి లేదు. ముఖ్యంగా రాజకీయాల్లో ఇది మరీ ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు.. టీడీపీ అధినేతగా చంద్రబాబు ఇలాంటివి అనేక చూశారు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం లో ఆయన అనేక ఆటుపోట్లు తిన్నారు. ఈ క్రమంలో ఇప్పుడున్న జూనియర్లను ఎలా దారిలో పెట్టాలో ఆయనకు కొట్టిన పిండి. అందుకే.. మౌనంగా ఉన్నారన్నది పార్టీలో జరుగుతున్నచర్చ. అదే బయట పడిపోయి.. చర్యలు-చర్చలు అంటూ చెబితే.. దీనికి అంతూ దరీ ఉండదు. ఈ కీలక విషయం తెలిసిన చంద్రబాబు.. దారి తప్పుతున్న నాయకులను సైలెంట్‌గా పనిష్ చేస్తున్నార ని పార్టీ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు యాగీ చేసిన పలువురు నాయకులకు సంబంధించిన నివేదికలు రెడీ చేసారు. వారు ఏయే తప్పులు చేశారు? ఎక్కడెక్కడ ఎలా వ్యవహరిం చారన్న విషయాలు కూడా చంద్రబాబు డ్యాష్ బోర్డులో సిద్ధంగా ఉన్నాయి. కానీ, చర్యలుతీసుకోలేదు. అంతకు మించి.. మౌనంగా ఉన్నారు. దీని అర్థం బోధ పడక నాయకులు తల్లడిల్లుతున్నారు.అంతేకాదు.. ఇప్పుడు నోరు విప్పేందుకు కూడా సాహసించడం లేదు. ఈ ఫలితం ఇతర నాయకులపై కూడా పడింది. ఎవరూ తప్పులు చేసేందుకు, నోరు విప్పించేందుకు కూడా ముందుకు రాలేక పోతున్నా రు. వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో. అని కొందరు ఎదురు చూస్తున్నారు. ఇక, వివాదాల్లో చిక్కుకున్నవారిని పార్టీలో పెద్దగా గుర్తింపు లేకుండా పోయింది. వారి మాటకు కూడా వాల్యూలేకుండా పోయింది.సో.. మౌనంగా ఉన్న చంద్రబాబు ప్రత్యక్ష చర్యల కన్నా కూడా పరోక్షంగా.. వారికి బలమైన పనిష్మెంటే ఇచ్చారని.. ఇంతకన్నా ఒక నాయకుడికి ఏం కావాలని.. ఇకనైనా వారు మారాలని సీనియర్లు చెబుతున్నారు. అదే చర్యలు తీసుకుని సస్పెండో.. మరొకటో చేసి ఉంటే..ఇతర నాయకులు కూడా.. ఇదే బాట పడతారన్న అభిప్రాయం కూడా ఉంది. ఇలా.. మౌనంగా ఉండి కూడా సాధించవచ్చన్న కీలక సూత్రాన్ని చంద్రబాబు ఫాలో అవుతుండడం గమనార్హం.

# కేసీఆర్ వస్తే కానీ మార్పు రాదా?



హైదరాబాద్,తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రాజకీయంగా పట్టు సాధించాలంటే పార్టీ అధినేత కేసీఆర్ అడుగు పెట్టాల్సిందేనా? అన్న చర్చ జరుగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత ఎర్రవెల్లి ఫాం హౌసుకు వెళ్లిపోయిన గులాబీ బాస్ ఆ తర్వాత రాష్ట్ర రాజకీయాలను పెద్దగా పట్టించుకోవడమే మానేశారన్న ఆవేదన బీఆర్ఎస్ కేడర్ లో వ్యక్తమవుతోంది. ఈ రెండేళ్లలో ఒకటి రెండు సార్లు మాత్రమే ఫాం హౌస్ నుంచి బయటకు వచ్చిన గులాబీ బాస్ కేసీఆర్.. కార్యకర్తలను సంతృప్తి పరచలేకపోయారని అంటున్నారు. పదమూడేళ్ల ఉద్యమం.. పదేళ్ల అధికారంలో ఉండగా, అధినేతతో బాగా కనెక్ట్ అయిన కార్యకర్తలు ఇప్పుడు ఆయన బయటకు రాకుండా ఉ ండిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండటం వల్లే పార్టీ పరిస్థితి పూర్తిగా దిగజారిపోతోందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఏర్పడిందని, ఈ క్షణంలో ఎన్నికలు జరిగినా అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ హైకమాండ్ ఇప్పటివరకు చెబుతూ వస్తోంది. తగిన సమయం వచ్చినప్పుడు కేసీఆర్ తప్పకుండా వస్తారని కూడా ప్రచారం చేసింది. అయితే జూబ్లీహిల్స్ సిటింగు స్థానాన్ని కాపాడుకోవడం, ప్రభుత్వానికి రెఫరెండంగా ఈ ఎన్నికను ప్రకటించిన తర్వాత అయినా కేసీఆర్ ప్రచారానికి వస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలికి బలపం కట్టుకున్నట్లు ఒక ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్ లో అసలు ఎలాంటి అంచనాలు లేని కాంగ్రెస్ పార్టీని 51 శాతానికి పైగా ఓట్లతో గెలిపించారని పరిశీలకులు కొనియాడుతున్నారు. సీఎం రేవంత్ కి చెక్ చెప్పేలా కేసీఆర్ వస్తే జూబ్లీహిల్స్ చేయిదాటి పోయేది కాదన్న విశ్లేషణలు వస్తున్నాయి. కేసీఆర్ వస్తే ఆ జోష్ వేరేగా ఉండేదని కార్యకర్తల అభిప్రాయంగా ఉంది. కానీ, కేసీఆర్ అసలు పట్టించుకోకపోవడం వల్ల జూబ్లీహిల్స్ కోల్పోవాల్సివచ్చిందని అంటున్నారు. అయితే ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లో ఇంతవరకు గెలవలేకపోయిందని, పార్లమెంటు ఎన్నికల్లో కనీసం ఒక్కసీటు కూడా తెచ్చుకోలేకపోవడం వల్ల పార్టీ పరిస్థితి దిగజారిందనే అభిప్రాయం విస్తృతంగా వ్యాపించిందని అంటున్నారు. ఇక స్థానిక ఎన్నికలు జరిగితే మెజార్టీ సీట్లు గెలుచుకుని మళ్లీ పూర్వవైభవం దిశగా అడుగులు వేయొచ్చని అంచనా వేస్తే.. కోర్టు తీర్పుతో ఆ ఎన్నికలు వాయిదా పడ్డాయని అంటున్నారు. ఇదే సమయంలో జరిగిన ఉప ఎన్నికల్లో అధినేత గైర్హాజరీతో మూల్యం చెల్లించుకోవాల్సివచ్చిందనే ఆవేదన వ్యక్తమవుతోంది.గత రెండేళ్లుగా జరిగిన పరిణామాలను గమనిస్తే కేసీఆర్ మళ్లీ యాక్టివ్ అయితే కానీ, పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు పార్టీ కోసం రెక్కలు అరిగేలా కష్టపడుతున్నా, ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని పొందలేకపోతున్నారని కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నిరూపించాయని అంటున్నారు. ఆ ఇద్దరిపై నమ్మకం ఉంచి పార్టీని అప్పగిస్తే ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి కనీసం పోటీ పెట్టలేకపోయారన్న విషయాన్ని ఎత్తిచూపుతున్నారు. మరోవైపు ఇద్దరినీ మాజీ ఎమ్మెల్సీ కవిత టార్గెట్ చేస్తూ విమర్శలు చేయడం వల్ల పార్టీ పరపతి క్షీణిస్తోందని అంటున్నారు.ఈ పరిస్థితుల్లో అధినేత కేసీఆర్ అడుగు పెడితే కానీ పరిస్థితిలో మార్పు రాదని ఎక్కువ మంది నుంచి వినిపిస్తోంది. కవిత నోటికి తాళం వేయాలన్నా. రేవంత్ రెడ్డికి చెక్ చెప్పాలన్నా కేసీఆర్ ప్రధా న రాజకీయ స్రవంతిలో మళ్లీ యాక్టివ్ అవ్వాల్సివుంటుందని అంటున్నారు. అధినేత వస్తే కేడర్ లో కూడా ఉత్సాహం వస్తుందనే అభిప్రాయం ఉందని అంటున్నారు. ఎన్నికల సమయంలో అయినా చొరవ తీసుకోక పోతే. జూబ్లీహిల్స్ ఫలితాలు రిపీట్ అయినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని అంటు న్నారు.

# వైసీపీ చూస్తోంది.. జనసేన దూసుకుపోతోంది.. !



అమరావతి,ఏపీ ప్రతిపక్షం(ప్రధాన కాదు) వైసీపీ ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతోందా? అనే విషయాలను ఆసక్తిగా పరిశీ లిస్తోంది. ముఖ్యంగా కూటమి పార్టీల్లో తప్పులను వెతికేందుకు మాత్రమే వైసీపీ పరిమితం అవుతోందన్న చర్చ కూడా సాగుతోంది. కానీ.. అవే కూటమి పార్టీలు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. ఎవరి పని వారు చేసుకుంటున్నారు. ఎవరి శాఖలను వారు ముందుకు నడిపిస్తున్నారు. మధ్యంలో చిన్న చిన్న అవాంతరాలు వచ్చినా.. సర్దుకు పోతున్నారు.కానీ, ఇదేసమయంలో వైసీపీ మాత్రం పని వదిలేసి పరిశీలనకే పరిమితం అయిందన్న వాదన వినిపిస్తోం ది. మరీ ముఖ్యంగా కూటమి కట్టేందుకు, దానిని ముందుకునడిపించేందుకు కీలకంగా వ్యవహరించిన జ నసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారా? అని వైసీపీ మరింత ఎక్కువగా పరిశీ లన చేస్తోంది. ఈ పరిణామాలు.. జనసేనపై కంటే కూడా.. వైసీపీ పైనే ఎక్కువగా ప్రభావం చూపుతున్నా యి. ఎందుకంటే.. చూస్తూ కూర్చుంటే అక్కడే ఉండిపోతాం.. చేస్తూ ఉంటే ముందుకుసాగుతాం అనే సామెత గుర్తుంది కదా!.అలానే.. వైసీపీ ఎక్కడి గొంగళి అక్కడే ఉంది. కానీ.. జనసేన మాత్రం గిరిజన ప్రాబల్య నియోజకవర్గాల్లో జెండా పాతేస్తోంది. ఇది వైసీపీకి అత్యంత ప్రమాదకరమైన సంకేతం. ఎందుకంటే.. ఇప్పటి వరకు వరకు పార్టీ ఓడినా గెలిచినా.. గిరిజనులు జగన్ వెంటే ఉన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. దీనిని పసిగట్టినా.. జనసేన దూకుడుగా ఉందన్న విషయం తెలిసినా.. వైసీపీ ఎక్కడా ఉలకడం లేదు. పలకడం కూడా లేదు.ఇక, మరో కీలక విషయం.. గ్రామీణ ప్రాంతాల్లోనూ జనసేన దూకుడు పెంచింది. ఇది కూడా ప్రత్యక్షంగా పరోక్షంగా వైసీపీని ఇరుకున పడేసే వ్యవహారమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు టీడీపీ-వైసీపీ బలంగా ఉన్నాయి. ఇప్పుడు వైసీపీ ఓటు బ్యాంకును తనవైపు తిప్పుకొనేలా జనసేన కూడా వ్యూహాత్మక రాజకీయాలు చేస్తోంది. ఈ పరిణామాలతో గ్రామీణ ప్రాంతంలో జనసేనవికాసం మరో మెట్టు దూరంలోనే ఉందన్న చర్చ పార్టీలో వినిపిస్తోంది. అయినా.. వైసీపీలో కదలిక లేదు. ఆ పార్టీ చూస్తూ కూర్చుంటే.. జనసేన మాత్రం చేసుకుంటూ పోతుండడం గమనార్హం.

# రంగా ఆశయాలు... వారసుల ఆశలు.. అసలేంటి.. ?



అమరావతి,వంగవీటి మోహనరంగా. ఈ పేరుకు పెద్దగా పరిచయం అవసరం లేదు.వాస్తవానికి కాపు నాయకులు.. రంగాను తమ వాడిగా పేర్కొంటాయి. తమ కోసమే ఆయన రాజకీయాల్లో అనేకం చేశారని కూడా చెబుతాయి. అయితే.. ఆయా సామాజిక వర్గాలు అనుకున్నట్టుగా రంగా ఒక వర్గానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వలేదు. తనను తాను అందరి వాడిగా ఎస్టాబ్లిష్ చేసుకున్నారు. తాజాగా ఆయన కుమార్తె ఆశ చెప్పినట్టు.. కులం, మతం, ప్రాంతానికి రంగా ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వలేదు.

అంతేకాదు.. ఒక ప్రాంతానికి కూడా పరిమితం కాకుండా.. రంగా అనేక సేవలు చేశారు. ఖమ్మం, వరంగల్ వంటి ప్రాంతాల్లోనూ పేదల కోసం.. వారి హక్కులు, ఇళ్ల కోసం ఉద్యమించారు. ఈ క్రమంలోనే ఆయన విజయవాడలో కొండ ప్రాంతాల వాసులకు పట్టాలు ఇవ్వాలనే ఉద్యమం చేపట్టి.. దానిలోనే కరిగిపోయారు. ఇది.. ఇతమిత్థంగా రంగా గురించి చెప్పే ప్రధాన విషయం. కట్ చేస్తే.. ఇప్పుడు ఆయన ఆశయాలు నిలబెడతామని.. ఆయన కోసం పనిచేస్తామని చెబుతూ... కుమార్తె ఆశ ప్రజల క్షేత్రంలోకి వస్తున్నట్టు ప్రకటించారు.అయితే.. ఇప్పటి వరకు రంగా ఆశలు, ఆశయాలు నెరవేర్చడంలో ఈ కుటుంబం ఏమేరకు సక్సెస్ అయిందన్నది ప్రధాన ప్రశ్న. 1988, డిసెంబరు 26న రంగా మరణించే వరకు.. ఆయన ప్రజల పక్షాన పోరాటం చేశారు. ఈ తరహా స్ఫూర్తిని కొనసాగించడంలో కుటుంబం విఫలమైందన్నది వాస్తవం. పదవులు, రాజకీయాల కోసం.. వెంపర్లాడడంతోనే ఆయన సతీమణి, కుమారుడు కూడా కాలం వెళ్లదీశారన్నది నిష్ఠూరంగా అనిపించినా... పచ్చి నిజం. ఒకానొక దశలో కాంగ్రెస్ టికెట్ ఇవ్వనంటే రంగా కుంగిపోలేదు. కుమిలిపోలేదు.అలాగని మరో పార్టీలోకి కూడా రంగా వెళ్లలేదు. ప్రజల మధ్యకు వచ్చారు. వారితోనే తన జీవితమని ప్రకటించారు. అప్పటికి మహా అయితే.. 35-37 ఏళ్ల వయసు ఉంటుంది. ఇండిపెండెంటుగా పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. ఆ తర్వాత అదే కాంగ్రెస్ పార్టీ ఆయనను తిరిగి ఆహ్వానించింది. ఇదీ.. రంగా స్ఫూర్తి.. పేదలకు మేలు చేయడమే ఆయన ఆశయం. ఈ తరహా స్ఫూర్తిని ఆశా కిరణ్ అందుకుంటారా? లేక ఏదో ఒక పార్టీకి అంకితం అవుతారా..? అన్న దానిపైనే రంగా ఆశయ సిద్ధి ఆధారపడి ఉంటుంది. ఇంతకు మించి.. రంగా ఆశించింది కూడా ఏమీ లేదు. మరి ఆమె అడుగులు ఎలా పడతాయో చూడాలి.

# తెలంగాణ వ్యాప్తంగా చలితీవ్రత



హైదరాబాద్, తెలంగాణవ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. ఎముకలు కొరికే చలికి జనం తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఉదయం వేళల్లో భారీగా పొగమంచు కురుస్తున్నది. దానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల రెండురోజులు తెలంగాణలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉ ందని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ చలిగాలులు వీస్తాయని హెచ్చరించింది. మంగళవారం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శీతలగాలులు వీచే ఛాన్స్ ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెప్పింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖ తెలిపింది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. అదే సమయంలో హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం ఉ దయం ఈ సీజన్‌లోనే ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయని వాతావరణశాఖ తెలిపింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిధిలో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొంది. రాజేంద్రనగర్‌లో 10, కంటోన్మెంట్‌లో 11.2, మారేడ్‌పల్లిలో 11.5, కుత్బుల్లాపూర్‌లో 12, గచ్చిబౌలిలో 12 డిగ్రీలకు ఉ ష్ణోగ్రతలు పడిపోయాయని.. సోమవారం రాత్రి సైతం చలి కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం ఉదయం సైతం ఇలాంటి పరిస్థితులే ఏర్పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది.

# బ్యాంకు మోసం అల్ఫలా యూనివర్సిటీ ఛైర్మన్ సోదరుడు అరెస్టు




హైదరాబాద్ : ఢిల్లీ కారు బాంబు పేలుడు కేసులో నిందితులకు ఆశ్రయం ఇచ్చిన హరియాణాలోని ఫరీదాబాద్ లో గల అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్ జావెద్ సిద్ధిఖీ సోదరుడు హమూద్ అహ్మద్ సిద్ధిఖీని మధ్యప్రదేశ్ పోలీసులు నకిలీ బ్యాంకుతో అమాయకులను టోకరా వేసిన కేసులో అరెస్టు చేశారు. 25 ఏళ్ల క్రితం ఈ గోల్మాల్ వెలుగు చూడగా దీనిపై అప్పట్లో నమోదైన కేసులో ఇతను వాంటెడ్ నేరగాడు. ఇంతకాలం పరారీలో వున్న ఇతను ఢిల్లీ కారు బాంబు దాడి తరువాత అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్ జావెద్ సిద్ధిఖీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అతగాడి సోదరుడి భాగోతం రట్టయ్యింది. దీంతో ఢిల్లీ పోలీసుల సమాచారం మేరకు మధ్యప్రదేశ్ పోలీసులు హమూద్ అహ్మద్ సిద్ధిఖీని నగరంలో అరెస్టు చేశారు.వివరాలలోకి వెళితే మధ్యప్రదేశ్లోని మహూ ప్రాంతంలో 2000 సంవత్సరంలో హమూద్ అహ్మద్ సిద్ధిఖీ ఓ నకిలీ బ్యాంకును స్థాపించి అధిక వడ్డీ పేరుతో అమాయకుల నుంచి 50 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసి బిచాణా ఎత్తేశాడు. దీనిపై కేసు నమోదవగా హమూద్ అహ్మద్ సిద్ధిఖీ కుటుంబంతో సహా పారిపోయి హైదరాబాద్ కు మోహం మార్చి వేరే పేరుతో ఇక్కడ సాధారణ వ్యక్తిగా వుంటూ షేర్ మార్కెటింగ్ చేయసాగాడు. మరోవైపు హమూద్ అహ్మద్ సిద్ధిఖీ కోసం మధ్యప్రదేశ్ పోలీసులు 25 ఏళ్లుగా గాలిస్తున్నా ఆచూకీ లభించక పోవడం తో ఈ కేసును పెండింగ్లో వుంచారు.కాగా ఢిల్లీ పేలుడు తరువాత అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్ గా వున్న జావెద్ సిద్ధిఖీ పాత్రపై ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్, హరియాణా పోలీసులు విచారణ చేబట్టగా ఇతగాడి పై వున్న కేసులు ఇతని సోదరుడు హమూద్ అహ్మద్ సిద్ధిఖీపై వున్న కేసుల సంగతి వెలుగు చూసింది. దీంతో హమూద్ అహ్మద్ సిద్ధిఖీ గురించి ఢిల్లీ పోలీసులు మధ్యప్రదేశ్ పోలీసులకు సమాచారం అందించగా వారు వెంటనే విమానంలో హైదరాబాద్ కు వచ్చి ఇతన్ని అరెస్టు చేసి తమ వెంట తీసుకుపోయారు.

# టీడీపీలో ఇదే హాట్ టాపిక్.. మ్యాటర్ ఏంటంటే



న్యూఢిల్లీ,బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత టిడిపిలో ఆసక్తికర చర్చ తెర మీదకు వచ్చింది. దేశంలో జమిలి ఎన్నికలకు అవకాశం ఉంటుందని.. నాయకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన కూడా సాకారం అవుతుందన్న ఆశలు, అంచనాలు కనిపిస్తున్నాయి. ఈ విషయంపైనే టీడీపీ నాయకులు ఆసక్తిగా చర్చిస్తున్నారు. ప్రధానంగా గత ఎన్నికల్లో టికెట్లు దక్కని వారు, టికెట్లు త్యాగం చేసిన వారు ఇప్పుడు నియోజకవర్గ పునర్విభజనపైనే ఆశలు పెట్టుకున్నారు.గత ఎన్నికల్లో టికెట్లు త్యాగం చేసిన వారి స్థానంలో గెలిచినవారు ఉన్నారు. అదేవిధంగా స్వల్ప స్థాయిలో ఓడినవారు కూడా ఉ న్నారు. అయినప్పటికీ ఆయన నియోజకవర్గాల్లో పాత నేతలకు అవకాశం లేకుండా పోయిందన్నది కూడా వాస్తవం. టికెట్ త్యాగం చేసిన వారి విషయంలో అటు పార్టీ ఎలా ఉన్నప్పటికీ స్థానికంగా నాయకులు మాత్రం ఇబ్బందులు అయితే పడుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి తమకు మరో నియోజకవర్గమైన కేటాయించాలి.. అన్న డిమాండ్లు కూడా పెరుగుతున్నాయి.ఉదాహరణకు మైలవరం నియోజకవర్గం కోల్పోయిన మాజీ మంత్రి దేవినేని ఉమా అదేవిధంగా పెదకూరపాడు నియోజకవర్గాన్ని కోల్పోయిన కొమ్మలపాటి శ్రీధర్ ఇలా చాలామంది నాయకులు తమకు వేరే నియోజకవర్గమైనా కేటాయించాలని చెబుతున్నారు. లేదా వచ్చే ఎన్నికల్లో ఆయా స్థానాల్లో అయినా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రధానంగా చెబుతూనే ఉన్నారు. కానీ ఇప్పటివరకు పార్టీ ఈ దిశగా ఆలోచన చేయట్లేదు.ఎందుకంటే ఎన్నికలకు చాలా సమయం ఉంది. ఈ లోపు నియోజకవర్గాల పునర్విభజన అంశం తెర మీదకు వచ్చి అది గనక జరిగితే ఈ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని పార్టీ భావిస్తోంది. అయితే కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో టిడిపి కూడా భాగస్వామి కావడంతో ఈ విషయాన్ని సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు చంద్రబాబు ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని పలువురు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పుడు ప్రక్రియ మొదలుపెడితే కనీసం సంవత్సరం అయినా సమయం పడుతుందని నాయకులు చెబుతున్నారు.విభజన జరిగితే కొత్త నియోజకవర్గాలు ఏర్పడతాయి సుమారు 50 నియోజకవర్గాలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా గతంలో టికెట్లు త్యాగం చేసిన వారు కొత్తగా ఇప్పుడు కోరుకునే వారికి కూడా అవకాశం దక్కుతుంది అన్న విషయం స్పష్టం. అయితే ఈ దిశగా ఏ మేరకు అడుగులు పడుతున్నాయి అన్నదే అసలు చర్చ. కాగా, బీహార్ ఎన్నికల అనంతరం నియోజకవర్గాల పునర్విభజనపై దృష్టి పెడతామని కేంద్రం గతంలో హామీ ఇచ్చింది. దీంతో ఇప్పుడు ఈ విషయంపై టీడీపీ నాయకులు ఆసక్తిగా చర్చిస్తున్నారు. మరి ఎప్పుడు మొదలుపెడతారు ఏంటి అనేది చూడాలి.

# ట్రంప్ గాజా శాంతి ప్రణాళికకు భద్రతా మండలి ఆమోదం



ఐరాస: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదం తెలిపింది. రెండేండ్లుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి ముగింపుపలికేందుకు 20 సూత్రాల ప్రణాళికను డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ బలగాల నియోగం, యుద్ధ విరామం, పునర్నిర్మాణం, పాలనకు మార్గదర్శకాలు ఇందులో ఉన్నాయి. ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్-పాలస్తీనా తీవ్రవాద గ్రూపు హమాస్ గత నెల 10న సంతకాలు చేశాయి.ఐక్యరాజ్యసమితో సోమవారం జరిగిన ఓటింగ్‌లో అమెరికా, యూకే, ఫ్రాన్స్, సోమాలియా సహా మొత్తం 13 దేశాలు గాజా శాంతి ప్రణాళికకు మద్దతు తెలిపాయి. వీటో అధికారం ఉన్న రష్యా, చైనా ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత నెలలో యుద్ధ విరామం, బందీల విడుదల ఒప్పందంతో ప్రణాళిక మొదటి దశను అమలు చేసిన సంగతి తెలిసిందే. బోర్డ్ ఆఫ్ పీస్ అనే తాత్కాలిక సంస్థను ఏర్పాటు చేసి.. గాజా పునర్నిర్మాణాన్ని పర్యవేక్షించాలన్నది గాజా ప్లాన్ ఉద్దేశం.కాగా, ఈ తీర్మానాన్ని హమాస్ ఖండించింది. ఇది గాజా ప్రజల స్వతంత్రతను హరించడమేనని మండిప డింది. పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్యం, స్వయంపాలన హక్కులను ఈ తీర్మానం గౌరవించడంలేదని, ఇక్కడి ప్రజల రాజకీయ ఆకాంక్షలను పక్కన పెట్టి తాత్కాలిక

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com